PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 210 | విజయవాడ, మంగళవారం 5 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 5 March 2024 | Rs

ఉద్యోగోన్నతులపై స్పందించుకుంటే సహాయ నిరాకరణే

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల హెచ్చరిక
- ఢిల్లీలో పీస్ మార్చ్

లోపలి పేజీలో..

చరిత్ర సృష్టించిన భారత టిటిజట్లు

- పారిస్ ఒలింపిక్స్‌కు తొలిసారి పురుషుల, మహిళల టీమ్స్ అర్హత

లోపలి పేజీలో..

గిరిజన స్పెషల్ డిఎస్‌సి, జిఓ 3 పునరుద్ధరణ కోసం

10న ఏజెన్సీ బంద్‌కు మద్దతు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

రంపచోడవరం ఐటిడిఎ వద్ద గిరిజనుల ధర్నాకు వి.శ్రీనివాసరావు మద్దతు

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆదివాసీల హక్కులను హరిస్తోన్న బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వినాశకర వైసిపిలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తమను విస్మరించిన పార్టీలకు బుద్ధి చెప్పేందుకు గిరిజన ప్రజానీకం సిద్ధంగా ఉన్నారన్నారు. రంపచోడవరంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, జిఓ నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల పదిన ఆదివాసీ సంఘాలు తలపెట్టిన మన్యం బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. బంద్‌కు సంఘీభావంగా ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్రంలోని గిరిజన జిల్లాల్లో ఆదివాసీ జనరక్షణ దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దీక్షలను, మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజలను కోరారు. రాష్ట్ర విభజన అనంతరం ఆదివాసీ ప్రాంతాల్లో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ఇటువంటి తరుణంలో స్పెషల్ డిఎస్‌సి తీయకపోవడం, జిఓ నెంబర్ 3 పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి ప్రయత్నమూ చేయకపోవడం దారుణమన్నారు. అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చేసి భూములను లాగేసుకునేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఆదివాసీలపై దాడులు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆస్తులకు, మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. 'నా ఎస్‌సి. నా ఎస్‌టి' అని దీర్ఘాలు తీసే జగన్ ప్రభుత్వం హత్య కేసులో నిందితునిగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబును అందలం ఎక్కిస్తోందన్నారు. రంపచోడవరం ఎస్‌టి నియోజకవర్గంలో అతను చెప్పిన మనిషిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తున్నారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని భూములను హైడ్రో ప్రాజెక్టుల పేరిట అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందన్నారు. గ్రామసభల అనుమతులు లేకుండానే భూములు కట్టబెడుతున్నారని ఆగ్రహించారు. షెడ్యూల్ 5 కింద ఉన్న హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారన్నారు. రాజ్యాంగ ధిక్కరణకు పాల్పడుతున్న బిజెపిని, దానికి మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించాలని కోరారు.

రంపచోడవరం నుంచి పోటీ

రానున్న ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం నుంచి సిపిఎం పోటీ చేస్తుందని శ్రీనివాసరావు వెల్లడించారు. త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏజెన్సీ ప్రాంతంలో సిపిఎం ఎమ్మెల్యేగా పనిచేసిన సున్నం రాజయ్య ఆదర్శవంతమైన పాలన అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం రంపచోడవరం ఎమ్మెల్యేగా ఉన్న ధనలక్ష్మిగానీ, మాజీ ఎమ్మెల్యే మిగతా 2లో

షెడ్యూల్ మార్చండి

- టెట్-టిఆర్‌టిల మధ్య 4 వారాల గడువుండాలి
- రాష్ట్రాన్ని ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి) మధ్య కనీసం నాలుగు వారాల వ్యవధి ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తగిన సమయం ఇవ్వకపోవడం హక్కు లను హరించడమే అవుతుందని అభిప్రాయపడింది. రెండింటి మధ్య సుమచిత సమయం ఇవ్వకపోవడం రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని వ్యాఖ్యానించింది. టెట్-టిఆర్‌టిలను హడావుడిగా నిర్వహించాల్సిన అవసరం ఏముందని న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ప్రశ్నించారు. టెట్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 8న ఇచ్చిన నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 12న ఇచ్చిన నోటిఫికేషన్‌ను ప్రశ్నిస్తూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం పెద్దిరాజు సహా ఐదుగురు హైకోర్టును ఆశ్రయించారు. రెండు పరీక్షల మధ్య కనీస సమయం లేదని, గడువు లేకుండా షెడ్యూల్ నిర్ణయించడం అన్యాయమని, నోటిఫికేషన్లను రద్దు చేసి తిరిగి షెడ్యూల్ ఖరారు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ల వాదనల తర్వాత హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. టెట్, టిఆర్‌టిల మధ్య కనీసం నాలుగు వారాల సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్ మార్పు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక కీ జారీ తర్వాత అభ్యంతరాల స్వీకరణకు వాటిని పరిగణనలోకి తీసుకునేందుకు కూడా తగిన సమయం ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలంది. డిఎస్‌సి 2018లో నిర్వహించినప్పుడు టెట్, డిఎస్‌సిల మధ్య 60 రోజుల గడువు ఉందని గుర్తు చేసింది. తిరిగి ఐదేళ్ల తర్వాత నిర్వహించబోయే డిఎస్‌సి విషయంలో ఆఘమేఘాలపై హడావుడిగా చేయాల్సిన అవసరం ఎందుకని నిలదీసింది. ఇలా చేస్తే, ప్రాథమిక కీ జారీ, అభ్యర్థుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు తగిన సమయం ఉండదని, టెట్, టిఆర్‌టి మధ్య కనీసం నాలుగు వారాల సమయం ఉండేలా షెడ్యూల్‌ను ప్రభుత్వం మార్చాలని తీర్పునిచ్చింది.

ఓటుకు ముడుపులు తీసుకుంటే

బోనెక్కాల్సిందే!

అవినీతికి పాల్పడిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక రక్షణలేవీ ఉండవ్

1998 జెఎంఎం ముడుపుల కేసులో మెజార్టీ తీర్పును కొట్టేస్తూ స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

1998 నాటి జెఎంఎం ఎంపీల ముడుపుల కేసులో మెజార్టీ తీర్పును కొట్టివేస్తూ ఏడుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం సోమవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. పార్లమెంటులో పివి నరసింహారావు ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ముడుపులు తీసుకుని ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన సంగతి తెలిసిందే. పార్లమెంటులోపల సభ్యుల చర్యలు క్రిమినల్ ప్రాసిక్యూషన్ పరిధిలోకి రావని, ఈ విషయంలో పార్లమెంటు సభ్యులకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని ఆ కేసులో జెఎంఎం ఎంపీలు వాదించారు. సుప్రీం కోర్టు ధర్మాసనం ఆనాడు 3-2 తేడాతో జెఎంఎం ఎంపీలకు అనుకూలంగా ఆనాడు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు పలు విపరీత పరిణామాలకు దారి తీస్తుందని, ముడుపులు, అవినీతి వంటి విషయంలో చట్ట సభల సభ్యులకు ప్రత్యేక రక్షణల కింద ఎలాంటి మినహాయింపులు ఉండవని చీఫ్ జస్టిస్ డివై చంద్ర చూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ముడుపులు తీసుకుని ఓటు వేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై అవినీతి నిరోధక చట్టం కింద ప్రాసిక్యూట్ చేసేందుకు సిబిఐకి తలుపులు తెరిచింది. ముడుపులు తీసుకుని ఓటు వేసినా, ముడుపులు ముట్టజెప్పినవారికి అనుకూలంగా సభలో ప్రసంగించినా అది నేరంగానే పరిగణించబడుతుందని, అవినీతి నిరోధక చట్టం కింద సదరు ఎంపీ లేదా ఎమ్మెల్యే బోనెక్కాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డబ్బు ఎక్కడ చేతులు మారిందన్నది కాదు ముఖ్యం, ముడుపులు ముట్టాయా లేదా అన్నదే ఇక్కడ ప్రధానం అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్ 2012 రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి స్వతంత్ర అభ్యర్థి నుంచి లంచం తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే, తాను ఏ తప్పు చేయలేదని, తన సొంత పార్టీ నియమించిన అభ్యర్థికి ఓటు వేశానని ఆమె బుకాయించారు. ఈ కేసులో సిబిఐ ఆమెపై చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌ను కొట్టివేయాలన్న ఆమె అభ్యర్థనను జార్ఖండ్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ కేసులో తీర్పు 1998 నాటి జెఎంఎం ఎంపీల ముడుపుల కేసులో తీర్పుపై ఆధారపడి ఉండడంతో సెప్టెంబరు 20న సుప్రీం కోర్టు ఆ తీర్పును పునస్సమీక్షించాలని నిర్ణయించింది. సీతా సోరెన్ జెఎంఎం వ్యవస్థాపకుడు షిబు సోరెన్ కోడలు. షిబు సోరెన్ జెఎంఎం ఎంపీల ముడుపుల కేసులో నిందితుల్లో ఒకరు.

పివి నరసింహారావు కేసులో వెలువరించిన తీర్పు ఆర్టికల్ 105, 194కు విరుద్ధమని ధర్మాసనం తెలిపింది. శాసన అధికారాల ఉద్దేశం, లక్ష్యం తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అధికారాలు సమిష్టిగా చట్టసభలకు ఉంటాయని స్పష్టం చేసింది. ఆర్టికల్ 105, 194 సభ్యులకు నిర్భయ వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని తెలిపింది. అవినీతి, శాసనసభ్యుల లంచం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పనితీరును నాశనం చేస్తోందని తెలిపింది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి లంచం తీసుకుంటున్న ఎమ్మెల్యేలు అవినీతి నిరోధక చట్టం కింద కూడా బాధ్యులవుతారని సుప్రీంకోర్టు తెలిపింది.

ప్రజా ప్రతినిధి ముడుపులు తీసుకుని ఓటు వేయడం లేదా మాట్లాడడం క్రమశిక్షణ ఉల్లంఘన కిందికి వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

లంచం తీసుకున్నట్లు ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తే, అప్పుడు వాళ్లను విచారించవచ్చు అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 105, 194ను సాకుగా చూపి వాళ్లు విచారణ నుంచి తప్పించుకోజాలరని తెలిపింది. ఆర్టికల్స్ 105(2), 194(2) ప్రకారం ఎంపిలు, ఎమ్మెల్యేలకు రక్షణ కల్పిస్తే, అప్పుడు అది మొత్తం సభా వ్యవహారాలకు సంబంధం ఉన్నట్లు అవుతుంది. పార్లమెంటరీ హక్కులతో అవినీతిపరుల్ని రక్షించడం సరైన విధానం కాదు. లంచం దేని గురించి ఇచ్చారన్నది కాదు, లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం' అని అన్నారు.

వలంటీర్లను తొలగించబోం

- అధికారంలోకొస్తే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- 'రా... కదలిరా' ముగింపు సభలో టిడిపి అధినేత చంద్రబాబు

పెనుకొండలో 'రా... కదలిరా' ముగింపు సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాయలసీమ ప్రాంతానికి ఏమి చేశారో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురంలో నిర్వహించిన వైసిపి 'సిద్ధం' సభలో చెప్పలేకపోయారని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో ఏ ఒక్కటీ పూర్తవలేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.64 వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. అధికారంలోకొస్తే గ్రామ/వార్డు సచివాలయాల వలంటీర్లను తొలగించబోమన్నారు. ఈ విషయాన్ని వారికి టిడిపి నాయకులు, కార్యకర్తలు తెలియజేయాలని సూచించారు. టిడిపి చేపట్టిన 'రా... కదలిరా' ముగింపు కార్యక్రమం సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వేలాదిగా జనసమీకరణ చేశారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ వెయ్యి కోట్ల రూపాయలతో హోర్డింగులు వేయించుకొని ప్రచారం చేసుకున్నారనే తప్ప, రాయలసీమ ప్రాంతానికి చేసిన మేలు ఏమీ లేదని విమర్శించారు. తాము గొల్లపల్లి, చెర్లోపల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి నీటిని అందించామని, కియా పరిశ్రమను తీసుకొచ్చి ఈ ప్రాంతానికి ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇస్తామన్న జాబ్ కేలండర్ ఇవ్వకుండా నిరుద్యోగులకు మోసగించిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏడాదికి నాలుగు లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చెల్లి సునీత అడుగుతున్న దానికి సమాధానం చెప్పలేని స్థితిలో జగన్ ఉన్నారని దుయ్యబట్టారు. హంతకులు రాజకీయాల్లో కొనసాగడం అవసరమా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే 40 రోజుల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మిగతా 2లో

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత సీట్లకు

నేటి నుంచి దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కింద ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సమగ్రశిక్షా అభియాన్ డైరెక్టరు బి శ్రీనివాసరావు ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఈ చట్టం కింద 9,350 సీట్లు కేటాయించేందుకు రిజిస్ట్రేషన్ చేయబడ్డాయని తెలిపారు. ఒకటో తరగతిలో విద్యార్థులు సీట్లు పొందేందుకు మంగళవారం (ఈ నెల 5వ తేదీ) నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని వెల్లడించారు. ఈ నెల 25 వరకు cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు నింపాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, నెట్ కేంద్రాలు, మీ సేవ కేంద్రాలు, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో చేరేందుకు 2024 జూన్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు నిండాలని, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబి సిలబస్ పాఠశాలల్లో 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు నిండి ఉండాలని వివరించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18004258599ను సంప్రదించాలని సూచించారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.1.44 లక్షలు మించరాదని పేర్కొన్నారు.

2047 నాటికి 'వికసిత్ భారత్'

- ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

విజయ సంకల్ప సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

2047 నాటికి వికసిత్ భారత్ సాధన లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా పాలనలో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. బిజెపి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన 'విజయ సంకల్ప సభ'లో ఆయన మాట్లాడారు. కుంగిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. 'అప్పుడు మీరు తిన్నారు... ఇప్పుడు మేం తింటాం' అన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉందని విమర్శించారు. రాష్ట్రంలో సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని స్థాపించామని, అభివృద్ధి పథకాలకు ఇతోధికంగా సహకారం అందించామని అన్నారు. దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని, అందులో ఒకటి తెలంగాణలో పెడతామని తెలిపారు. 15 రోజుల్లో ఐదు ఎయిమ్స్‌లను ప్రారంభించామన్నారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామని చెప్పారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 400 సీట్లు గెలవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని, పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి బిజెపి కృషి చేస్తోందని తెలిపారు. గత పదేళ్లలో పేదరికం నుంచి 25 కోట్ల మంది బయటపడ్డారని చెప్పారు. అంతకుముందు రూ.7 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రామగుండం ఎన్‌టిపిసిలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు. దీంతోపాటు రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించారు.

పెద్దన్నలా సహకరించాలి : సిఎం రేవంత్

గుజరాత్‌కు సహకరించినట్లుగా తెలంగాణ అభివృద్ధికి కూడా తోడ్పాటు అందించాలని ప్రధాని మోడీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఎన్‌టిపిసికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. కంటోన్మెంట్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి పెద్దన్నలా మోడీ సహకారం అందించాలని కోరారు. గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూలు అనంతరం

గిఫ్టుల రూపంలో వేతనాలు

- వైసిపి అభ్యర్థులే చెల్లించేలా చర్యలు
- వారి ప్రచారకర్తలుగా వలంటీర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో స్వచ్ఛంద సేవలందించిన వలంటీర్ల పనిలో మార్పులు జరగనున్నాయి. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని పనులూ చేసిన వలంటీర్లకు ఎన్నికల షెడ్యూలు అనంతరం వేతనాలివ్వడం ప్రభుత్వపరంగా సాధ్యం కాదు. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ గుర్తింపూ ఉండదు. ఈ లోపు వారి సేవలను స్వచ్ఛందంగా పార్టీకి వినియోగించుకోవాలనే ఆలోచనతో ప్రస్తుత ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ప్రజలకు ఏ సంక్షేమ పథకాలు అందుతున్నాయో వలంటీర్లకు తెలుసు. ప్రతి ఇంటికీ వైసిపి తరపున కలిసి రావాలంటే అది వలంటీర్ల వల్లే సాధ్యం అవుతుంది. కనుక వారి సేవలను ఉపయోగించుకోవాలనే ఆలోచనతో వైసిపి ప్రభుత్వం కొత్త ప్రణాళికను రూపొందించినట్లు తెలిసింది. షెడ్యూలు వచ్చినప్పటి నుండి వారిని మీరే చూసుకోవాలని చెబుతూ వైసిపి అభ్యర్థులకు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులుగా ప్రకటించిన నాయకులు వలంటీర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, చేయాల్సిన పనిని వివరిస్తున్నారు. గిఫ్టుల రూపంలో కనీసం రూ.5 వేలకు తక్కువ గాకుండా ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం నుండి లబ్ధిపొందిన ప్రతి ఒక్కరి వివరాలూ సేకరించడం, ఆ కుటుంబ వివరాలను వైసిపి తరపున పోటీచేసే అభ్యర్థికి యాప్‌లో పంపించడం వలంటీర్ల పనిగా పెట్టనున్నారు. వారికి నెలకు ఐదువేలతోపాటు వారు చేసిన వీడియోలు, వాటి వ్యూవర్‌షిప్ ఆధారంగా కొంత మొత్తాన్ని కలపనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు సేకరించడం, ప్రభుత్వం తరపున పరోక్షంగా ప్రచారం చేయడం, వైసిపి అభ్యర్థులకు ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలను చేరవేయడం వలంటీర్ల పనిగా పెట్టారని తెలిసింది. వలంటీర్లతో ఎమ్మెల్యేలు, వైసిపి అభ్యర్థులు మండలాల వారీ సంక్షేమ పథకాల ప్రచారం పేరుతో సమావేశాలు ఏర్పాటు చేసి, తొలివిడత గిఫ్టులు ఇస్తున్నారు. ఇటీవల ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. గ్రామాల్లో పట్టు సాధించిన వలంటీర్లు ఎన్నికల్లోనూ కీలకంగా మారనున్నారు. దీంతో వారిపై వచ్చే విమర్శలకు సిఎం నుండి అన్ని స్థాయిల్లో వైసిపి నాయకులు ప్రతిస్పందిస్తున్నారు. వారికి వేతనాలు ఆపే అంశం, వైసిపి తరపున పోటీచేసే అభ్యర్థులకు సహకరించే అంశంపై గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారెవరూ స్పందించలేదు.

ప్రతి మహిళకు నెలకు రూ. 1000

- కేజ్రీవాల్ ప్రత్యేక పథకం
- రూ. 76 వేల కోట్లతో వార్షిక బడ్జెట్
- విద్యకు పెద్దపీట

ఢిల్లీ ఆర్థిక మంత్రి అతిషి, సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ప్రతి మహిళకు నెలకు రూ. 1000 అందచేసే 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'ను ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 76 వేల కోట్లతో ఢిల్లీ ఆర్థిక మంత్రి అతిషి అసెంబ్లీలో ప్రవేశపెడుతూ ఈ ప్రకటన చేశారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద 18 ఏళ్లు పైబడిన ప్రతీ మహిళకు నెలకు రూ. 1000 లభిస్తుందని మంత్రి తెలిపారు. అయితే ఈ పథకానికి అర్హత పొందాలంటే మహిళ ఢిల్లీ ఓటరు అయి ఉండాలని, ఇతర ప్రభుత్వ పథకం కింద ప్రయోజనాలను పొందకూడదని, అలాగే ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదని మంత్రి చెప్పారు. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఢిల్లీలో 67,30,371 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలాగే, ప్రస్తుతం పాఠశాలల స్థాయిలో అమలు చేస్తున్న బిజినెస్ బ్లాస్టర్స్ పథకాన్ని విశ్వ విద్యాలయాలు, పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటిఐ)ల్లో కూడా అమలు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. గత ఏడాది ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అతిషి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. అతిషి తన ప్రసంగంలో ఢిల్లీలో విజయవంతమైన విద్య, ఆరోగ్య నమూనాలను ప్రవేశపెట్టడంలో మాజీ మంత్రులు మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లు కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. ఇడి అరెస్టు చేయడంతో ఈ ఇద్దరూ ప్రస్తుతం జైలులో ఉన్న సంగతి తెలిసిందే. అలాగే అతిషి తన ప్రసంగంలో 'కేజ్రీవాల్ ప్రభుత్వం వరుసగా తన పదో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు ఇది గర్వించదగ్గ క్షణం. నేను సమర్పిస్తున్నది కేవలం పదో బడ్జెట్ మాత్రమే కాదు. ఢిల్లీని మార్చే చిత్రాన్ని సమర్పిస్తున్నాను. దేశరాజధాని ప్రజలందరకూ కేజ్రీవాల్ ఒక ఆశా కిరణం' అని కూడా తెలిపారు.

బడ్జెట్ కేటాయింపుల్లో అత్యధికంగా విద్యా రంగానికి రూ.16,396 కోట్లను మంత్రి కేటాయించారు. విద్యారంగంలో ఆప్ ప్రభుత్వం సాధించిన విజయాలను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యా కేటయింపుల్లో రూ. 100 కోట్లను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) కేటాయించగా, నూతన పాఠశాలలు, తరగతి గదుల నిర్మాణానికి రూ. 150 కోట్లను కేటాయించారు. తరగతుల గదుల నిర్వహణకు రూ. 45 కోట్లు కేటాయించారు. అలాగే సోమవారం బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ. 8,685 కోట్లు కేటాయించారు. ఆసుపత్రుల్లో ఉత్తమ సౌకర్యాల కోసం రూ. 6,215 కోట్లు కేటాయించారు. సాంఘిక సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎస్‌సి-ఎస్‌టి-ఒబిసి సంక్షేమ శాఖల కింద వివిధ పథకాల కోసం రూ. 6,216 కోట్లును కేటాయించారు. కాగా, ఢిల్లీలో గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ 78,800 కోట్లుతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో జి20 సమావేశాల సన్నాహాల కోసం తొమ్మిది పథకాలను కూడా ఉన్నాయి.

బిజెపి నుంచి మరో వికెట్ డౌన్

- అశ్లీల వీడియో బయటకు రావడంతో పోటీ నుంచి నిష్క్రమించిన బారబంకీ ఎంపి

లక్నో : బిజెపి తొలి అభ్యర్థుల జాబితాలో చోటు చేసుకున్న ఉత్తరప్రదేశ్‌లోని బారబంకీ నియోజకవర్గం ఎంపి అభ్యర్థి అవమానకరమైన పరిస్థితుల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యల వివాదంలో చిక్కుకుని బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు భోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్ సింగ్ ప్రకటించిన మలి రోజే మరో బిజెపి వికెట్ డౌన్ అయింది. బారబంకీ బిజెపి సిట్టింగ్ ఎంపి ఉపేంద్ర సింగ్ రేవత్ అశ్లీల వీడియో ఒకటి సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వేరే గత్యంతరం లేక పోటీ నుంచి నిష్క్రమించాడు. ప్రజల నుంచి ఛీత్కారాలు వస్తున్నాయి. దీంతో ఉపేంద్ర సింగ్ బుకాయింపులు మొదలుపెట్టాడు. ఈ వీడియోలో ఉన్నది తాను కాదని, డీప్ ఫేక్ ఎఐ సాంకేతికతతో ఈ వీడియో రూపొందించారని అంటున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడు. తాను నిర్దోషిగా బయటపడే వరకూ ఎన్నికల్లో పోటీ చేయనని సోమవారం ప్రకటించాడు.

బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక

- పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రచురించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' అనే పుస్తకాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ ప్రవేశిక విశిష్టతపై బాల, బాలికల్లో అవగాహన కల్పించేందుకు 'దళిత బహుజన రీసోర్స్ సెంటర్' ప్రచురించగా, అదే పుస్తకాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తిరిగి ప్రచురించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీని ఆయన అభినందించారు. ఇందులో రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచిన పలు ముఖ్యాంశాలను ఈ పుస్తకంలో పొందుపర్చారని తెలిపారు. 'ముఖ్యంగా రాజ్యాంగ ప్రవేశికలో పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయపరమైన ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, నమ్మకం, ఆరాధనలో స్వేచ్ఛను, స్థితిగతుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి అందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైఖ్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్తులో తీర్మానం చేసి శాసనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం' అని రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 ఏళ్లు పూర్తి చేసుకుని 75వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా బాల బాలికల్లో మన రాజ్యాంగ ప్రవేశిక గొప్పతనాన్ని తెలియజేసి వారిలో రాజ్యాంగం పట్ల అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఈ బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక అనే పుస్తకాన్ని రచించి ప్రచురించామన్నారు. భిన్నత్వానికి నిలయమైన దేశం ఏకత్వంలో కొనసాగడానికి రాజ్యాంగం దోహదపడిందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పిల్లలపై ఉందని, పిల్లలకు కూడా రాజ్యాంగ లక్ష్యాలు విలువలు తెలియాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని 'దళిత బహుజన రీసోర్స్ సెంటర్' ప్రచురించగా, దానిని ప్రచురించడానికి అనుమతినిచ్చినందుకు ఆ సెంటర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు లక్ష్మణరావు పేర్కొన్నారు.

5,192 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లెక్చరర్లు, టీచర్ల ఉద్యోగాలకు ఎంపికైన 5,192 మందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. సోమవారం ఎల్‌బి స్టేడియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..ఎల్‌బి స్టేడియంలోనే రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడిందని చెప్పారు. 'ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే న్యాయం జరుగుతుందని భావించారు. కానీ, కుటుంబ పాలనలో యువత ఆకాంక్షలు నెరవేరలేదు. కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యుల పదవులు ఊడగొడితేనే.. తమకు ఉద్యోగాలు వస్తాయని యువత భావించారు. అనుకున్నట్టే చేయడంతో.. ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయి. నాకు ఇంగ్లిష్ రాదని కొందరు అవహేళన చేస్తున్నారు... నేను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివా. గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదు. వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెబుతున్నారు. ఎక్కడా వాటికి శాశ్వత భవనాలు నిర్మించలేదు. వసతులు లేని అద్దె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడ్డారు. రేషనైలేజేషన్ పేరిట కెసిఆర్ ఆరు వేల పాఠశాలలను మూసివేశారు. కులవృత్తుల వారి పిల్లలు ఆ పనులే చేసుకోవాలని భావించారు. ఆయన మనవడి పెంపుడు కుక్క చనిపోతే వెటర్నరీ డాక్టర్ మీద కెసిఆర్ కేసు పెట్టారు' అని రేవంత్ విమర్శించారు.

గిరిజన బైలా మేరకే టీచర్ పోస్టుల భర్తీ

- హైకోర్టుకు రాష్ట్రం హామీ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని గిరిజన ప్రాంత ఉపాధ్యాయ పోస్టుల (517) భర్తీ ప్రక్రియ గురుకుల 'బైలా' మేరకే ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ భర్తీ చేస్తారని రాష్ట్ర సర్కారు.. హైకోర్టుకు హామీ ఇచ్చింది. డిఎస్‌సిలో కలిపి గిరిజన ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను బైలాకు అనుగుణంగానే చేస్తామని చెప్పింది. ప్రభుత్వం తరపున వివరాలను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కె జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ పరిగణనలోకి తీసుకుని ఆ అంశంపై దాఖలైన వ్యాజ్యం పరిష్కారమైనట్లుగా సోమవారం ప్రకటించారు. ఐటిడిఎ పరిధిలోని గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అధికారం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌కు మాత్రమే ఉంటుందంటూ టి విజయ్ కుమార్ సహా పది మంది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సోమవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది.

ఆ సమాచారం సరికాదు

- హెచ్‌డిఎఫ్‌సి వివరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి సచివాలయాలన్ని తాము తాకట్టు పెట్టుకోలేదంటూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వివరణ ఇచ్చింది. దాన్ని తాకట్టుపెట్టుకుని ఎవరికీ ఎటువంటి రుణాలూ ఇవ్వలేదని పేర్కొంది. ఓ పేపర్లో వచ్చిన సమాచారం సరైంది కాదని తెలిపింది. ఈ వార్తపై సిఆర్‌డిఎ అధికారులు హెచ్‌డిఎఫ్‌సి అధికారులతో మెయిల్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి బృందం సిఆర్‌డిఎకు వివరణ పంపించింది. మీడియా సంస్థకు పంపించినట్లు సిఆర్‌డిఎ ఇచ్చిన ప్రకటనలో పేర్కొనడంతోపాటు మెయిల్ సందేశాల తాలూకు చిత్రాలను మీడియాకు పంపించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు
మినిమం టైమ్‌స్కేల్ వేతనాలివ్వాలి

- ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ హైర్‌బస్ వర్కర్స్ ఫెడరేషన్

విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ వేతనాలను, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ హైర్‌బస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆర్‌టిసిలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర అసంఘటిత రంగ కార్మికులు సిఐటియు అనుబంధ సంఘమైన ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ హైర్‌బస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్‌టిసిలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అద్దెబస్సుల ఉద్యోగులు, కాలాన్ డ్రైవర్లు హాజరయ్యారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. ఎపిఎస్ఆర్‌టిసిలో వేలాది మంది కనీస వేతనాలకు నోచుకోకుండా పనిచేస్తున్నారని అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యంతోపాటు ప్రభుత్వం కూడా వారిని ప్రిన్సిపల్ ఎంప్లాయర్లుగా గుర్తించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి యజమాన్యం కార్మికుల పట్ల నిజాయతీగా చట్టాలను అమలు చేయాలన్నారు. అలాగే అద్దెబస్సు కాలాన్ డ్రైవర్లకు మినిమం టైమ్ స్కేల్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ, పిఎఫ్, ఇఎస్ఐను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐలను చెల్లించని అద్దెబస్సుల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఆర్‌టిసి యజమాన్యం చేపట్టే కొత్త రిక్రూట్‌మెంట్‌లలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లలో పనిచేస్తున్న వారిని తీసుకోవాలని కోరారు.

ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ హైర్‌బస్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తులసిరామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసిలో వున్న 129 డిపోల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, హైర్‌బస్‌ల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చామని తెలిపారు. చాలా డిపోల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రోజువారీ రూ.200 నుంచి రూ.300 మాత్రమే ఇస్తుండటంతో వారి వేతనం నెలకు రూ.6 వేలకు మించి రావడం లేదని అన్నారు. చాలా డిపోల్లో ఆర్‌టిసి యజమాన్యం కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలకు వదిలేసిందని విమర్శించారు. డిపోల్లో చట్టప్రకారం వారాంతపు సెలవులు కూడా ఇవ్వకున్నా అధికారులు స్పందించకపోవడం తగదని అన్నారు. ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అద్దెబస్సుల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఉద్యమిస్తామని అన్నారు.

ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపరెడ్డి, హైర్‌బస్ కార్మికుల సంఘం కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆర్‌టిసిలోని అసంఘటిత రంగంలో వున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అద్దెబస్సుల కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావాలని కోరారు. ఆర్‌టిసిలో థర్డ్ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి యాజమాన్యమే వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే విధంగా బ్యాంకు రుణాలను అందించాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి-జనసేన బిసి డిక్లరేషన్ నేడు విడుదల

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసిల సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలతో టిడిపి-జనసేన కూటమి బిసి డిక్లరేషన్ విడుదల చేయనుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో మంగళవారం జయహో బిసి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిక్లరేషన్‌కు సంబంధించిన అంశాలపై టిడిపి-జనసేన నాయకులు టిడిపి కార్యాలయంలో సోమవారం చర్చించారు. వివరణాత్మక బిసి డిక్లరేషన్‌ను ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ సదస్సుకు హాజరై డిక్లరేషన్ విడుదల చేస్తారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు చెప్పారు. రాష్ట్రంలో బిసిల కులగణన అత్యంత అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేపట్టాల్సిన అంశాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అమలు చేయాల్సిన నిర్ణయాలు, వివిధ కులాల వారీ అందించాల్సిన మద్దతు వివరాలు ఉంటాయని టిడిపి బిసి సాధికారత కమిటీ ఛైర్మన్ కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అనగాని సత్యప్రసాద్, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, పి అనురాధ, నాయకులు బీద రవిచంద్ర యాదవ్, వీరంకి గురుమూర్తి, జనసేన నాయకులు పోతిన మహేష్, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పలు కమిటీల్లో అదనపు నియామకాలు

టిడిపి పలు అనుబంధ సంఘాల కమిటీల్లో అదనపు నియామకాలు జరిగాయి. టిడిపి రాష్ట్ర తొగట/తొగటి సాధికార సమితి కన్వీనర్‌గా మడక చక్రధర్‌ను, కుర్ని/కరికాల భక్తుల/నిస్సి కన్వీనర్‌గా టంకశాల హనుమంతప్పను, అరెకటిక కన్వీనర్‌గా హనుమంతకారి హరికృష్ణారావును నియమించింది. ముస్లిం మైనార్టీ, వాణిజ్య విభాగం, వికలాంగుల, తెలుగు మహిళా కమిటీల్లో పలువురి నియామకాలు జరిగాయి. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగినట్లు అచ్చెన్నాయుడు ప్రకటించారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- సిఎంకు రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జెఎసి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వశాఖలు, విద్యుత్, స్థానిక, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీల్లో దాదాపు 3 లక్షల మంది ఉద్యోగులు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేసేటప్పుడు తాము అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 3 లక్షల మందిలో 10,177 మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని, తక్షణం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌తోపాటు రాష్ట్రంలోని 28 ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారందరికీ మినిమం టైమ్‌స్కేల్, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు వినే తీరిక మంత్రికి లేదా?

- కౌలుదారుల సమస్యలను వివరించేందుకు వెళ్లిన నాయకులు
- అడ్డగించిన పోలీసులు
- కౌలురైతు సంఘం నేతల అరెస్టు

కౌలు రైతు సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

రాష్ట్రంలో 70 శాతం మంది కౌలుదారులేనని, వారి సమస్యలు వినే తీరిక మంత్రికి లేదా? అని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు ప్రశ్నించారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేలా చట్టాన్ని సవరించాలని, కౌలు రైతులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో ఈ అంశాలను చేర్చాలని కోరుతూ సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలిసేందుకు నాయకులు బయలుదేరారు. వీరిని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయం సమీపంలోని పార్కు రోడ్డులో వార్డు సచివాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పిఎతో మాట్లాడామని, మంత్రిని కలిసేందుకు అనుమతి ఉందని నాయకులు చెప్పినా పోలీసులు వినలేదు.

ఇప్పుడు వీలుపడదని మంత్రి తమకు ఫోన్‌లో చెప్పారని పోలీసులు చెప్పడంతో నాయకులు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, హరిబాబు మాట్లాడుతూ.. కౌలుదారులకు గుర్తింపు కార్డులు దక్కకపోవడంతో ఇ-క్రాప్‌లో నమోదు చేయడం లేదని, పంట నష్ట పరిహారం, బీమా, రైతు భరోసా వంటివి కౌలు రైతులకు అందడం లేదని తెలిపారు. గ్రామ సభల ద్వారానే కౌలు దారులకు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలను మంత్రికి వివరించేందుకు ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం తలెత్తింది. నాయకులను లాక్కెళ్లి పోలీసులు జీపుల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

టిడిపి నేతలు, నారాయణ విద్యా సంస్థల ఉద్యోగుల ఇళ్లలో
పోలీసుల సోదాలు

- రూ.1.81 కోట్లు స్వాధీనం!

స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా రవాణా శాఖాధికారి ఫిర్యాదు మేరకు టిడిపి నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ మద్దతుదారులు, నారాయణ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగుల నివాసాల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల విజేత రెడ్డి నివాసానికి వెళ్లిన పోలీసులు ఆమె ఇల్లంతా తనిఖీ చేశారు. నగదు ఎక్కడ ఉందంటూ ప్రశ్నించారు. తన వద్ద ఎలాంటి నగదూ లేదని, ఎందుకు వచ్చారని ఆమె నిలదీశారు. దీంతో, పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం నారాయణకు ఫైనాన్షియర్‌గా ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త కోట గురుబ్రహ్మం, నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నారాయణ విద్యా సంస్థల అకౌంటెంట్ తదితరుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ముప్పాళ్ల విజేత రెడ్డి నివాసాన్ని మూడుసార్లు తనిఖీ చేసినా పోలీసులు కేవలం 25 వేల రూపాయలే గుర్తించారు. తనిఖీల విషయం తెలుసుకొని విజేతరెడ్డి నివాసానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెళ్లి పోలీసులను ప్రశ్నించారు. రాంజీ నగర్ మొదటి వీధిలోని గిరీష్‌కుమార్ ఇంట్లో రూ.1,06,06,000, హరినాథ్‌పురం రెండో లైన్‌లోని బి.ప్రసాద్ ఇంట్లో రూ.20,50,000, రామలింగాపురం ఒకటో వీధిలోని కోట గురుబ్రహ్మం ఇంట్లో రూ.25,55,000, చింతారెడ్డిపాళెంలోని నారాయణ స్టాఫ్ క్వార్టర్స్‌లోగల ఓ ఇంట్లో రూ.29,45,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కోట గురుబ్రహ్మంను బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి అనంతరం విడిచిపెట్టారు. తనిఖీల్లో మొత్తం కోటీ 81 లక్షల రూపాయలకుపైగా సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ చూపలేకపోవడంతో ఆ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖాధికారులకు అప్పగిస్తామని చెప్పారు. నారాయణ బంధువైన పునీత్‌పై బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'నారాయణ' యాజమాన్యం మోసగించింది : ఎస్‌పి

నారాయణ విద్యాసంస్థలు నకిలీ పత్రాలు సమర్పించి ఎన్ స్పెరా సంస్థ ద్వారా పాఠశాల బస్సులను 91 కొనుగోలు చేసిందని ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్న రూ.1.81 కోట్లకుపైగా నగదును చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నకిలీ పత్రాల ద్వారా నారాయణ విద్యా సంస్థల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దీనివల్ల రవాణా శాఖ కోటీ 12 లక్షల రూపాయల ఆదాయం కోల్పోయిందని చెప్పారు. ఈ వ్యవహారమంతా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ గుర్తించి విచారణ చేపట్టాలని రవాణా శాఖను కోరిందని, రవాణా శాఖాధికారులు ఈ నెల 2న నెల్లూరులోని బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో, సోదాలు నిర్వహించామని, విచారణ అనంతరం మరిన్ని వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

'ఉక్కు' ప్రయివేటీకరణ కుట్రలు తిప్పికొడతాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను ఐక్యపోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1117వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఆర్ఎం 1, 2 విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ వేతనాలను కూడా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆలస్యం చేస్తోందని తెలిపారు. వేలాది మంది ఉద్యోగులు నెల వచ్చేసరికి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కష్టపడి పని చేసిన వారికి వేతనాలు చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకును సక్రమంగా అందజేసి పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చూడాలన్నారు.

జగనన్న కాలనీల్లో రూ.5,277 కోట్లతో విద్యుదీకరణ పనులు

- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ షర్మిలారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 10,950 జగనన్న లే అవుట్లలో రూ.5,277 కోట్ల వ్యయంతో విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయని గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 7,942 లే అవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన లే అవుట్లలో పనులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం 36వ బోర్డు సమావేశం సంస్థ ఛైర్మన్ షర్మిలారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో ఐదు లక్షల ఇళ్లకు మంచినీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు కె వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంత వరకు 7.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు చంద్రశేఖర్, డైరెక్టర్లు కె భాస్కరనాయుడు, పి పెద్దిరాజు, ఉప్పాడ శివారెడ్డి, రమాదేవి, కె విజయకుమార్ పాల్గొన్నారు.

విట్‌లో ముగిసిన ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు 6వ సమావేశం అమరావతిలోని విట్‌లో సోమవారం ముగిసింది. 'విశ్వవిద్యాలయాల్లో శక్తిమంతమైన పరిశోధన, సృజనాత్మక పర్యావరణ వ్యవస్థ' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆది, సోమవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించింది. తొలిరోజు వర్చువల్‌గా పాల్గొన్న ఎఐసిటిఇ ఛైర్మన్ టిజి సీతారాం మాట్లాడుతూ.. సంయుక్త డిగ్రీలపై దృష్టి పెట్టాలని కోరారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించేలా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని చెప్పారు. మైక్రోసాఫ్ట్ డైరెక్టరు విన్నీ జౌహరి సోమవారం మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ద్వారా ప్రపంచ విద్యా ప్రమాణాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎపిలో ఉన్నత విద్యాసంస్థల ద్వారా 1.25 లక్షల మంది విద్యార్థులు మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లలో పేటెంట్ ఫైలింగ్, సంస్కరణల వృద్ధి గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఉన్నత విద్యలో పరిశోధన, ఆవిష్కరణలపై సమగ్ర విధానాన్ని రూపొందించాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఎపి ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు కె రామ్మోహనరావు, పి ఉమామహేశ్వరి, కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన డిఎస్‌సి అభ్యర్థి

- ఉద్యోగం ఇవ్వాలని వినూత్న నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

పురుగు మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న శ్రీనివాసరావు

డిఎస్‌సి-1998లో అర్హత సాధించిన తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్‌ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగా ఉన్న సెల్ టవర్ ఎక్కి ఓ అభ్యర్థి పురుగుల మందు డబ్బా పట్టుకుని సోమవారం నిరసన చేపట్టారు. మంగళగిరిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సెల్ టవర్‌ను నెల్లూరు జిల్లాకు చెందిన భైరవకోన శ్రీనివాసరావు... వైసిపి జెండా మెడలో వేసుకుని సిఎం ఫ్లెక్సీ పట్టుకుని సెల్ టవర్ ఎక్కారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉండి నిరసన తెలిపారు. డిఎస్‌సి 1998లో నాలుగు వేల మందికి ఉద్యోగాలివ్వగా వారిలో రెండు వేల మంది ఇప్పటికే రిటైర్ అయ్యారని, అయితే 1840 మందికి ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. రిటైర్ అయిన వారి స్థానంలో మిగతా వారిని భర్తీ చేయాలని కోరారు. దీనిపై సిఎం జగన్ నిర్ణయం తీసుకోకుంటే పురుగుమందు తాగుతానని సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. తనను కాపాడేందుకు ఎవరైనా టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తే పురుగుల మందు తాగుతానని బెదిరించారు. పోలీసులు సెల్ టవర్ వద్దకు చేరుకున్నారు. కిందకు దిగాలని కోరగా.. మంత్రి బొత్స సత్యనారాయణ లేదా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తేనే దిగుతానని చెప్పారు. దీంతో పోలీసులు కొద్దిసేపు చూసి వెళ్లిపోయారు. సాయంత్రానికి అతను దిగివెళ్లిపోయారు.

వలంటీర్లను తొలగించబోం

(మొదటి పేజీ తరువాయి)

కష్టపడి పనిచేయాలని కోరారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వైసిపి నాశనం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపు సిపిఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు ఇచ్చిన హామీపైనా, దళిత డ్రైవరును హత్య చేసి డోర్ డెలివరీ చేయడంపైనా, మద్యం నియంత్రణ చేస్తామని విచ్చలవిడిగా విక్రయాలు పెంచడంపైనా, ఏటా జాబ్ కేలండర్ ఇస్తామని ఇచ్చిన హామీపైనా, మూడు రాజధానుల పేరుతో ఏ రాజధానీ లేకుండా చేయడంపైనా సమాధానం చెప్పడానికి జగన్ సిద్ధమేనా? అని ప్రశ్నించారు. ఈ సభలో మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్, కందికుంట వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10న ఏజెన్సీ బంద్‌కు మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

వంతల రాజేశ్వరిగానీ ప్రజలకు చేసింది ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. వారు ప్రజలకు చేసిందేమీ లేకపోగా పోలవరం ప్రాజెక్ట్ కోసం సర్వస్వాన్ని కోల్పోయిన నిర్వాసితులకు చెల్లించాల్సిన ప్యాకేజీని కూడా చెల్లించకుండా గిరిజనాన్ని గోదాట్లో ముంచారని తెలిపారు. కాంటూరు పేరుతో కాకి లెక్కలు చెప్పి రెండు పర్యాయాలు వరదల్లో మునిగిపోయిన వారికి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షా ఆరు వేల కుటుంబాల వారు నిరాశ్రయులైతే, వారిలో కేవలం 22 వేల కుటుంబాలకు మాత్రమే నామమాత్రంగా లక్ష, లక్షన్నర రూపాయల ప్యాకేజీలను ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఐటి సిబ్బంది సేవలు అభినందనీయం

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో 2024కు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగంలో వరుసగా 6వ సారి ఎపిఎస్‌ఆర్‌టిసి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డుకు ఎంపికవడం పట్ల ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారిని ఆయన సత్కరించారు. కోల్‌కతాలో డిజటల్ అవార్డును అందుకున్న అధికారులను సోమవారం విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. దేశంలో ఏ ఆర్‌టిసి చేయని విధంగా ఎపిఎస్‌ఆర్‌టిసి యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలను నిర్వహిస్తోందని తెలిపారు. అలాగే కాగిత రహిత టికెట్లను ఆర్‌టిసి అమలు చేస్తోందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎపిఎస్‌ఆర్‌టిసి సాంకేతికంగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఐటి చీఫ్ ఇంజినీరు ఎ సుధాకర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీరు వై గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 20న రెవెన్యూ దినోత్సవం

- జిఓ 81 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతియేటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం (రెవెన్యూ డే) జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం జిఓ ఎంఎస్ నెంబరు 81ని విడుదల చేసింది. రెవెన్యూశాఖలో ఉన్నత సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను ఆ రోజు సత్కరించుకోవడం కోసం రెవెన్యూ దినోత్సవాన్ని ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. రెవెన్యూ దినోత్సవాన్ని ఆ రోజు రాష్ట్రంలోని ప్రతి మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించాలని తెలిపింది. రెవెన్యూశాఖ అందించే సేవలపై అవగాహన కల్పించాల్సి ఉంటుందని పేర్కొంది. రెవెన్యూ రికార్డులు, అడంగల్, 1-బి ప్రభుత్వ, దేవాదాయశాఖ, వక్ఫ్ భూముల వివరాలు డిస్‌ప్లే చేయడంతోపాటు సంబంధిత విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించింది. ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం చేయడం, సెలక్షన్ కమిటీ ద్వారా తమ విధులు, సేవల్లో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రెవెన్యూ ఉద్యోగులకు కమెండేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని జిఓలో స్పష్టం చేసింది. తమ విజ్ఞప్తి మేరకు 1786లో రెవెన్యూశాఖ ఏర్పడిన జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు.. ప్రభుత్వానికి, సిఎం జగన్‌కు, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

జిఓ 3 చట్టబద్ధతకు ఆర్డినెన్స్, స్పెషల్ డిఎస్‌సి కోసం

కలెక్టరేట్ ముట్టడి

పాడేరులో గిరిజనుల ర్యాలీ, రంపచోడవరం, చింతూరుల్లో ధర్నా

ప్రజాశక్తి - పాడేరు, రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

జిఓ నంబర్ 3 చట్టబద్ధతకు ఆర్డినెన్స్ జారీ చేయాలని, గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా పాడేరు కలెక్టరేట్‌ను సోమవారం గిరిజనులు ముట్టడించారు. 'చలో పాడేరు' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏజెన్సీ నలుమూలల నుంచి గిరిజన యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ కన్వీనర్ నరేష్, కో- కన్వీనర్ నారాయణరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6100 డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టుల్లో 1025 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించారని, 517 పోస్టులు నోటిపై చేశారని, అందులోనూ 38 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించారని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఐదు శాతం గిరిజనేతరులకు 95 శాతం ఉద్యోగాలు, 95 శాతం మంది ఆదివాసీలకు ఐదు శాతం ఉపాధ్యాయ పోస్టులు కేటాయించడం దారుణమన్నారు. ఈ నిర్ణయంతో ఆదివాసీ యువత భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మాతృభాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలని, వారికి మినిమం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమావతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శాంతి కుమారి మద్దతు తెలిపారు.

రంపచోడవరం ఐటిడిఎ వద్ద గిరిజనులు ధర్నా నిర్వహించారు. అనంతరం పిఒ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, టిడిపి మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మద్దతు తెలిపారు. చింతూరు ఐటిడిఎ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఆదివాసీ ప్రజా ప్రతినిధులు పూనెం ప్రదీప్‌కుమార్, వి.రాజ్ కుమార్ మాట్లాడారు.

పాడేరులో కలెక్టరేట్ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న గిరిజన యువకులు, సురేంద్ర

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ.. పరిటాల శ్రీరామ్ గ్రూపుల మధ్య ఘర్షణ
- 25 వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి-బత్తలపల్లి (సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. పెనుకొండ నియోజకవర్గంలో నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభకు వెళ్తుండగా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మద్దతుదారులు ఎదురెదురుగా తలపడి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. దాదాపు 25 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకర్గం కేంద్రం సమీపంలోని 'కియా' వద్ద రా..కదిలి రా కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ధర్మవరం నియోజకర్గం నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ అభిమానులు బయల్దేరారు. బత్తలపల్లి టిడిపి కార్యాలయం వద్దకు సూర్యనారాయణ మద్దతుదారుల వాహనాలు రాగానే శ్రీరామ్ మద్దతుదారులు నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు గ్రూపుల వారు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో సూర్యనారాయణ మద్దతుదారులకు చెందిన 20 వాహనాలు, శ్రీరామ్ మద్దతుదారులకు చెందిన ఐదు కార్లు ధ్వంసమయ్యాయి. ఆరుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరుగ్రూపులను అక్కడి నుంచి చెదరగొట్టారు. దీంతో సమస్య సర్దుమణిగింది.

ఘర్షణలో ధ్వంసమైన వాహనం

ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రం

- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రత మొదలైంది. ఈ ఏడాది మార్చి నుంచే భానుడు బెంబేలెత్తిస్తున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా ఎండలు ఎక్కువ అవడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెలలోనూ ఈ పరిస్థితి వుంటే.. రానున్న వేసవి తీవ్రతను ఎలా తట్టుకోవాలో అనే ఆందోళనతో ప్రజలు భయపడుతున్నారు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎండల తీవ్రతను పెంచుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా వుండే అవకాశం వుందని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ మీడియాకు వివరించారు. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో ఎక్కువగానూ, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ కోనసీమ, విశాఖ, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే జిల్లాలపై అధికారులు దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచనలు జారీ చేశామన్నారు.

మరణాలను తగ్గించాలి

2016లో అత్యధికంగా 48.6 డిగ్రీలు, 2017లో 47.8 డిగ్రీలు, 45.6 డిగ్రీలు, 47.3 డిగ్రీలు, 47.8 డిగ్రీలు, 45.9 డిగ్రీలు, 45.9 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదుకాగా, గతేడాది తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్‌లో అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు.

అలాగే 2016లో 723 మంది వడగాల్పులకు మృతి చెందగా, 2017లో 236, 2018లో 8, 2019లో 28 మంది మరణించారన్నారు. అధికార యంత్రాంగం సమన్వయ చర్యలతో 2020 నుంచి 22 వరకు వడగాల్పుల మరణాలు చోటుచేసుకోలేదని, గతేడాది మరణించారని తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఏమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగానికి రెండు రోజుల ముందుగానే ఉష్ణోగ్రత వివరాలు, వడగాలుల తీవ్రతపై సూచనలు జారీ చేయనున్నట్లు చెప్పారు.

జాగ్రతలు తప్పనిసరి

ఎండలతో పాటు క్యుములోనింబస్ మేఘాల వల్ల ఆకస్మికంగా భారీ వర్షాలు, పిడుగులు పడనున్నందున వీటిపట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా వుండాలని కూర్మనాథ్ సూచించారు. విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 18004250101కు సమాచారం కోసం 24 గంటల్లో ఎప్పుడైనా సంప్రదించవచ్చన్నారు. అలాగే ప్రజల ఫోన్లకు విపత్తుల సంస్థ నుంచి వడగాల్పుల హెచ్చరిక సందేశాలు జారీ చేస్తామని తెలిపారు. దినసరి కూలీలు ఉదయంపూటనే పనులు పూర్తిచేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరేలా చూసుకోవాలన్నారు. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులను తప్పకుండా తీసుకెళ్లాలన్నారు. డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ టోల్‌గేట్ వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు నుండి నెల్లూరు జిల్లాకు రేషన్ బియ్యం రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు టోల్‌గేట్ వద్ద నిఘా ఉంచారు. బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా తనిఖీలు చేసి పట్టుకున్నారు. 620 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.11.78 లక్షలు ఉంటుందని అంచనా. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణా వెనుక ఎవరున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐ ఎ శ్రీహరి, విఆర్ఒ రామారావు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యం లారీ

భావ ప్రకటనా స్వేచ్ఛ దుర్వినియోగమే ఇది!

- ఉదయనిధి వ్యాఖ్యలపై సుప్రీం

న్యూఢిల్లీ : సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలపై పలు రాష్ట్రాల్లో దాఖలైన ఎఫ్‌ఐఆర్‌లన్నింటినీ కలిపి విచారించాల్సిందిగా తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ పెట్టుకున్న పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. పిటిషనర్ సామాన్యుడేమీ కాదని, మంత్రి అని, తన వ్యాఖ్యల వల్ల తలెత్తే పర్యవసానాల గురించి ఆయనకు బాగానే తెలిసి వుండాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన బెంచ్ పేర్కొంది. ఈ కేసుకు గల అర్హతల గురించి తాను సుప్రీం కోర్టు ముందు మాట్లాడడం లేదని, అనుసరించాల్సిన పద్ధతికి సంబంధించిన ప్రశ్నపై మాట్లాడుతున్నానని ఉదయనిధి స్పందించారు. పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కావడం వల్ల సక్రమ విచారణకు తనకు గల హక్కు ఉల్లంఘించబడుతోందని, పైగా ప్రాసిక్యూషన్‌కు ముందుగానే వేధింపులు ప్రారంభం కావడం కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లు దాఖలైన ప్రతి రాష్ట్రంలోనూ హైకోర్టులను ఆశ్రయించాలని జస్టిస్ ఖన్నా అన్నారు. ఎఫ్‌ఐఆర్‌లు నమోదైన రాష్ట్రాల్లో చార్జిషీట్‌లు దాఖలయ్యాయో లేదో కూడా తెలియదని, గతంలో ఇలాంటి సందర్భాల్లో సుప్రీం జోక్యం చేసుకుని ఎఫ్‌ఐఆర్‌లను కలిపి ఒక్కచోట విచారించిన కేసులు వున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి తెలిపారు. ఇందుకు ఉదాహరణలుగా టివి యాంకర్లు అర్ణబ్ గోస్వామి, అమిష్ దేవగన్, నూపుర్ శర్మల కేసులు ఉదహరించారు.

కేంద్రం వడ్డీ దందా

- రాష్ట్రానికి 30 పథకాలపై తాజా లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అప్పు ఇచ్చిన వాళ్లు వడ్డీ వసూలు చేయడం సాధారణమే. అయితే రాష్ట్రాల్లో అమలు చేసే పథకాలకు నిధులు సాయం చేసే కేంద్రం కూడా వడ్డీలు వసూలు చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పైగా ఈ వడ్డీలు సక్రమంగా చెల్లించడం లేదని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడం ఆశ్చర్యకరం. తాజాగా ఇదే అంశంపై రాష్ట్రాలకు లేఖలు రాస్తోంది. కేంద్ర ఆధీనంలోని పిఎఫ్ఎంఎస్ నుంచి రాష్ట్రానికి కూడా లేఖ అందింది. సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాల్లో జమ చేసిన నిధులపై వచ్చిన వడ్డీని తమ ఖాతాలకు బదలాయించాలని నిర్దేశించింది.

కేంద్రం నుంచి అనేక రాష్ట్ర పథకాలకు నిధుల సాయం వస్తుంటుంది. ఈ నిధులు రాష్ట్రానికి వచ్చిన తరువాత వాటిని ఒక్కో పథకానికి ఒక్కో సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత అవసరాన్ని బట్టి ఆ నిధులకు తమ రాష్ట్ర వాటా నిధులను కూడా జత చేసి ఆయా పథకాలకు వినియోగిస్తారు. ఈ మధ్య కాలంలో ఖాతాలో ఉన్న నిధులపై కొంత వడ్డీ కూడా బ్యాంకుల ద్వారా సమకూరుతుంది. ఈ వడ్డీ నిధులనే తిరిగి కేంద్రానికి జమ చేయాల్సి ఉంటుందని కేంద్ర అధికారులు చెబుతున్నారు.

ఇలా ప్రస్తుతం రాష్ట్రానికి 30 వరకు పథకాలకు కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. వీటిపై రూ.20 కోట్ల వరకు వడ్డీ ఎస్ఎన్ఎ ఖాతాకు జమైనట్లు కేంద్రం చెబుతోంది. ఈ వడ్డీనే ఇంకా తమకు జమ చేయలేదని రాష్ట్రానికి రాసిన లేఖలో కేంద్రం ప్రస్తావించింది. రాష్ట్రం నుంచి రావాల్సిన వడ్డీ నిధులకు సంబంధించి మొత్తం రూ.20 కోట్ల 31 లక్షల వరకు రావాల్సి ఉందని తాజా లేఖలో పేర్కొంది. ఇందులో స్వచ్ఛ భారత్ మిషన్, సర్వే పథకాలు, అమరావతి, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి స్మార్ట్ నగరాలకు ఇచ్చిన నిధులు, వ్యర్థాల నిర్వహణ, ట్రైబల్ పథకాలు వంటివి 30 పథకాల జాబితాను కూడా రాష్ట్రానికి పంపించారు.

టిడిపిలోకి ఎమ్మెల్సీ రఘురాజు సతీమణి

- లోకేష్ సమక్షంలో చేరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సతీమణి సుధారాణి సోమవారం టిడిపిలో చేరారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆమెకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో సోమవారం చేరికల కార్యక్రమం జరిగింది. ఆమెతోపాటు 15 మంది సర్పంచులు, 17 మంది ఎంపిటిసిలు తదితరులు పార్టీలో చేరారు. స్థానిక సంస్థలను జగన్ నిర్వీర్యం చేశారని లోకేష్ ఈ సందర్భంగా విమర్శించారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్పంచ్, ఎంపిపి, ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు తగిన గౌరవంతోపాటు వేతనం కూడా పెంచుతామని చెప్పారు. సుధారాణి మాట్లాడుతూ.. ఎస్‌కోట నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కబ్జాల కోటగా మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి భూమా కిశోర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆళ్లగడ్డ బిజెపి నియోజక ఇన్‌ఛార్జి భూమా కిశోర్‌రెడ్డి వైసిపిలో చేరారు. సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో భూమా కిశోర్‌రెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. భూమా కిశోర్‌రెడ్డితోపాటు ఆళ్లగడ్డ బిజెపి నాయకులు భూమా వీరభద్రారెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి తదితరులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, పాల డెయిరీ ఛైర్మన్ ఎస్‌వి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రీ పబ్లికేషన్ ఆఫర్
PSBH
రీటా నేర్పిన పాఠం
1975-1985 జ్ఞాపకాలు
బృందాకారత్ ఆత్మకథాత్మక కథనం ఇది
మహిళా దినత్సోవం మార్చి 8 సందర్భంగా



అన్ని జిల్లాలలో ఆవిష్కరణ ఉంటుంది
మార్చి 7వ తేదీలోపు ఆర్డర్ పంపి డబ్బులు చెల్లించినవారికి రూ.200 పుస్తకం రూ.100లకే అందించగలం. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరు.
పేజీలు : 200
వెల : 200/-
వివరాలకు : డి.రమాదేవి, ప్రధాన కార్యదర్శి, ఐద్వా
లక్ష్మయ్య, ప్రజాశక్తి బుక్‌హౌస్
94900 98620, 9490099057
PSBH

MSME TECHNOLOGY CENTRE
A Government of India Society, Ministry of Micro, Small and Medium Enterprises
Plot No.6, IC-Pudi, Near APSEZ, Atchuthapuram, Visakhapatnam, Andhra Pradesh -531011
www.msmetcvizag.com Email: info@msmetcvizag.org, Ph.: 08924- 282600/603/616

ADMISSION NOTICE FOR AICTE APPROVED DIPLOMA COURSES ENTRANCE TEST-2024

The MSME Technology Centre, Visakhapatnam is the premium Skill development Centre established through the Ministry of Micro, Small and Medium Enterprises, Govt. of India under the auspices of the World Bank. The primary objective of the Technology Centre is to Provide World-Class education, skill development training and conduct innovative research at the interface of multiple disciplines to create high-quality human resources in disciplinary and interdisciplinary areas of Engineering Technologies to this end, Technology Centre Visakhapatnam also provides Design, Development & Manufacturing support to the SME's of Andhra Pradesh and creates Business opportunities for the growth of Industry development.

Applications are invited in the prescribed format for admission into the following AICTE approved Full-time Diploma courses for the academic session 2024-25.

COURSE	DURATION	INTAKE	MIN. QUALIFICATION	AGE
DIPLOMA IN ADVANCED DIE & MOULD MAKING	(3+1) Years	60	10th std. with Science & Mathematics from a recognized board.	Max. 19 Years as on 01/07/2024 (3 Years relaxation for SC/ST candidates)
DIPLOMA IN ADVANCED MECHATRONICS & INDUSTRIAL AUTOMATION	3 Years	60		

Reservation on seats for SC/ST/OBC (Non-creamy layer)/EWS are applicable as per Govt. of India rules.
Registration can be done through our website **www.msmetcvizag.org** under the link **"AICTE Diploma Courses"** or can be collected from Centre's Admissions Desk on any working day from **10:00 AM to 5:00 PM.**

Start of registration	05/03/2024	Last date for registration	02/05/2024
Written Test (Online/Off Line)	05/05/2024	Declaration of Test Result	10/05/2024
Admission & Counseling Process	03/06/2024	Commencement of Course	17/06/2024

NOTE: *The above schedule/procedure may change subject to situations & directives from Competent Authorities.
- For Day scholars Students APSRTC Buses facility available from nearest places.
- Separate hostel facility is available for both boys and girl students with eminent facilities.

PLACEMENT: Placement will be provided for the candidates after completion of the course successfully.
For query please contact: 9515397553/08924-282600/603/604/616
Email id: info@msmetcvizag.org, info.tcmsmepudi@gmail.com website: www.msmetcvizag.org
Sd/-
DEPUTY GENERAL MANAGER

MANAPPURAM HOME FINANCE LTD.
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: U65923K12010PIC039179
నమోదిత కార్యాలయం: IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సూర్, కేరళ 680567
కార్పోరేట్ కార్యాలయం: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మూడవ అంతస్తు, యూనిట్ నం.301 నుండి 315, ఎ వింగ్, 'కనకియ వాల్ స్ట్రీట్', అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబాయి 400093, మహరాష్ట్ర. ఫోన్ నం.022-66211000, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా దిగువ రుణగ్రహీత/లు కంపెనీ నుండి వారి ద్వారా పొందిన అసలు మరియు రుణ సౌకర్యం యొక్క వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు మరియు రుణాలను నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించడమైనది. వారిచే కంపెనీకి తెలిపిన చివరి చిరునామాలకు సెక్షన్ 13 (2) ఆఫ్ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద వారికి తేదిన నోటీసు జారీ చేయబడింది, దిగువ లెక్కించిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కోసం అదనంగా, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతుంది.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ లోను ఖాతా నంబర్/శాఖ	సృష్టింబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం బకాయిలు
1	1. లేట్ మట్టపుడి యేసేబు మరణించినప్పటి నుండి, అతని చట్టపరమైన వారసులను సంబోధిస్తూ, మట్టపుడి భారతీ రాణి, మట్టపుడి మణిబాబు, రాపరల సాంబశివరావు /PU90HLLONS000005003108/ విజయవాడ	ఆర్.ఎస్.నం.426/1ఎ, డో.నం.8-90, వణుకూరు గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా, పి.ఓ. కంకిపాడు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్ : 521151	10-08-2022	19-02-2024 & Rs. 1,57,554/-
2	1. లేట్ మట్టపుడి యేసేబు మరణించినప్పటి నుండి, అతని చట్టపరమైన వారసులను సంభోధిస్తూ, మట్టపుడి భారతి రాణి, మట్టపుడి మణిబాబు /MO90HLLONS000005003484/ విజయవాడ	ఆర్.ఎస్.నం.426/1ఎ, డో.నం.8-90, వణుకూరు గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా, పి.ఓ., కంకిపాడు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్ : 521151	10-08-2022	19-02-2024 & Rs. 5,00,609/-

పై రుణగ్రహీత/లు సలహా ఏమనగా నోటీసు U/s. 13(2) జారీచేసిన తేది నుండి 60 రోజులలోగా మొత్తం బకాయిలు చెల్లించవలెను, విఫలమైనయెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన పేర్కొన్న తేదిన నోటీసు U/s. 13(2) యొక్క జారీ తేది నుండి 60 రోజులు దాటిన తరువాత తదుపరి చర్యలు తీసుకొనబడును.

సం/-
అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
తేది: 5 మార్చి, 2024
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్వాధీనతా ప్రకటన
అనుబంధం - 4 - స్థిరాస్తి కొరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8(1) క్రింద. సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద ఏర్పాటు కాబడినది.
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద **గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు / సహ రుణగ్రహీతలు / రుణగ్రహీతల యొక్క న్యాయవారసులకు డిమాండు నోటీసు జారీచేసి సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు చెల్లించు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొదలగు వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది. రుణగ్రహీతలు దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఇందుమూలముగా ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రాజికమునకు తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొనబడిన ఆస్తిన దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.**
ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరిపితే లోన్ రీకాల్ నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు తదుపరి వడ్డీలు, ఛార్జీలు మొదలగు వారి కొరకు బ్యాంకు యొక్క ఛార్జీకి లోబడి ఉండగలదు.
హామీగల ఆస్తులు విడిపించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నిబంధనలను రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది.

1	**రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత: 1) మంజుల కరుణ కుమారి, W/o చంద్రమోహన్ (లేటు) డిమాండు నోటీసు తేదీ: 15-12-2023 బాకీపడిన మొత్తం : రుణ నెం. 052213000627లో రూ.27,49,857/- 30-11-2023** నాటికి పూర్తిగా చెల్లించే వరకు వడ్డీ మరియు ఛార్జీలు మొదలైనవి. **భవానీపురం బ్రాంచ్** **ఆస్తి వివరణ:- ఆస్తి దారు : మంజుల కరుణ కుమారి:** డోర్ నెం. 76-13-45K/1, ఫ్లాట్ నెం.2, ఆకర్షిత అపార్ట్‌మెంట్స్ వెనుక వైపు, జోజి నగర్, విజయవాడ - 520012. విజయవాడ సబ్ రిజిస్ట్రీ నందు అసెస్‌మెంట్ నెం.1073157812 (పాత అసిస్ట్ నెం.325919) డాక్ నెం.6042/2010. సర్వే నెం.28/1లో 156.10 చ.గజాల ఆస్తి నందలి జి+1 ఆర్‌సిసి బిల్డింగ్. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** రోడ్డు (30 అడుగులు), **దక్షిణం:-** ఫ్లాట్ నెం.1 (46-10 అడుగులు), **పశ్చిమం:-** చెన్నుపాటి రాజగోపాలరావు (30 అడుగులు), **ఉత్తరం:-** ఫ్లాట్ నెం.3 (46-10 అడుగులు). స్వాధీనం చేసుకున్న తేదీ: 28-02-2024
2	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: కూరపాటి లీల W/o వెంకటేశ్వరరావు డిమాండు నోటీసు తేదీ: 15-12-2023 బాకీపడిన మొత్తం: రుణ నెం.052213000720లో** 30-11-2023 నాటికి **రూ.6,25,099/-** తదుపరి వడ్డీతో పాటు పూర్తిగా చెల్లించే వరకు ఛార్జీలు మొదలైనవి. **భవానీపురం బ్రాంచ్** **ఆస్తి వివరణ:- ఆస్తి దారు: కూరపాటి లీల :** డోర్ నెం.13-7, చౌదరి పేట, సిమెంట్ రోడ్, ఎలప్రోలు కొత్తూరు, ఎలప్రోలు, ఇబ్రహీంపట్నం మండలం-521228. అసెస్‌మెంట్ నెం.262 మరియు ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రీ నందు డాక్ నెం.6362/2014 & 856/2014. సర్వే నెం.6/1లోని ఆస్తి కొలత 184.15 + 35.38 అంటే, 219.54 చ.గజాలలో ఆర్‌సిసి బిల్డింగ్. **ఆస్తి సరిహద్దులు: 184.15 గజాలు: తూర్పు:-** 2వ అంశం మరియు బోయినపల్లి శిల్ప, **దక్షిణం:-** బోయినపల్లి రమేష్ మరియు శిల్ప, **పశ్చిమం:-** బండారుపల్లి నారాయణరావు, **ఉత్తరం:-** వంకాయలపాటి పుణ్యవతమ్మ. **ఆస్తి సరిహద్దులు 35.38 చ.గజాలు: తూర్పు:-** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:-** బోయినపల్లి శిల్ప, **పడమర:-** 1వ అంశం, **ఉత్తరం:-** వంకాయలపాటి పుణ్యవతమ్మ. స్వాధీనం చేసుకున్న తేదీ: **04-03-2024**

ది.04-03-2024
స్థలం : విజయవాడ
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్
ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

ఆంక్షల వాణిజ్యం

ఐదు రోజులపాటు అబుదాబీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) 13వ మినిస్టీరియల్ సమావేశాలు ఉమ్మడి డిక్లరేషన్ లేకుండా ముగిశాయి. ప్రజల ఆహార భద్రతపైనా, ఆహార ధాన్యాల సేకరణకు ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలపైనా, వ్యవసాయ రంగంపైనా సంపన్న దేశాలు కత్తి కట్టగా, అటువంటి అంశాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. తీవ్ర విభేదాలు బయట పడ్డాయి. దాంతో ప్రస్తుతానికి స్టేటస్ కో అమలు చేయాలన్న నిర్ణయానికి కాన్ఫరెన్స్ వచ్చింది. ఈ ఏడాది చివరికి సభ్య దేశాల మధ్య వివాదాలను పరిష్కరించుకొని వీలైన మేరకు ఉమ్మడి అభిప్రాయం తీసుకు రావాలని ఆశించింది. సమావేశాల్లో ఎలాంటి తీర్మానం చేయనప్పటికీ, భారతదేశం తరఫున మంత్రి పియూష్ గోయల్ సంతృప్తి వ్యక్తం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆహార భద్రత కోసం బహిరంగ ధాన్యాల నిల్వ డిమాండ్‌ను భారత్ చేయగా, కాన్ఫరెన్స్‌లో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయినప్పటికీ, అక్కిడికి తామేదో సాధించినట్లు కేంద్ర ప్రభుత్వం ఫోజు పెట్టడం క్షమించరానిది. పలు వర్ధమాన దేశాలు తమ రైతాంగ ప్రయోజనాల నిమిత్తం ధనిక దేశాలు ముందుకు తెచ్చిన వినాశకర షరతులను వ్యతిరేకిస్తుండగా మన దేశం ఆ పని చేయకపోవడం గర్హనీయం.

డబ్ల్యుటిఒ కాన్ఫరెన్స్ ఫిబ్రవరి 26న మొదలుకాగా సభ్య దేశాల మధ్య చర్చల్లో తీవ్ర ప్రతిష్టంభన కారణంగా ఒక రోజు అదనంగా పొడిగించారు. అయినా ఎజెండా ఆమోదం పొందలేదంటే, ఆయా అంశాలపై పలు దేశాల్లో ఉవ్వెత్తున లేచిన ప్రజాందోళనలే కారణం. ప్రధానంగా వ్యవసాయరంగంపై డబ్ల్యుటిఒ ఆంక్షలు దాడి చేస్తున్నాయి. రైతుల ఆర్థిక స్థితిగతులను కుదేలు చేస్తున్నాయి. పోలండ్ సహా పలు చోట్ల రైతుల ఆగ్రహావేశాలు మిన్నంటాయి. వాటిని గ్రహించిన దేశాలు డబ్ల్యుటిఒ షరతులను అంగీకరించలేదు. కానీ మన దేశం అందుకు భిన్నంగా వ్యవహరించింది. డబ్ల్యుటిఒ భేటీ ప్రారంభమైన రోజున 500 సంఘాలకు నేతృత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 400 జిల్లాల్లో ట్రాక్టర్లతో రైతులు పరేడ్ చేసి నిరసన తెలిపారు. డబ్ల్యుటిఒ ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేశారు. వినాశకర ఆంక్షలకు వంత పాడొద్దని, వ్యతిరేకించాలని నినదించారు. రైతుల ఆందోళనలను మోడీ ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. బహుళజాతి కంపెనీలు, దేశంలోని కార్పొరేట్ల కోసం షరతుల పట్ల లొంగుబాటు ప్రదర్శించింది. తీర్మానానికి సైతం నోచుకోని కాన్ఫరెన్స్‌పై సంబరపాటు అందుకే.

డబ్ల్యుటిఒ ఏర్పడిందే అమెరికా, ఇతర సంపన్న దేశాల ప్రయోజనాల కోసం. ఆచరణలో అది రుజువైంది కూడా. డబ్ల్యుటిఒ ఆదేశాల ప్రకారం మోడీ ప్రభుత్వం నడుచుకుంటోందనడానికి పలు ఉదాహరణలే ఉన్నాయి. ప్రపంచ దేశాల్లోకెల్ల ఆకలి సూచిలో అధమస్థానంలో ఉన్నాం. కరోనాతో పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ఇదే సమయంలో మోడీ సర్కారు ఆహార పంపిణీకి, ఆహార ధాన్యాల కొనుగోలుకు సబ్సిడీలు తగ్గించింది. వ్యవసాయరంగానికి, ముఖ్యంగా ఎరువుల రాయితీకి బడ్జెట్‌లో నిధులు దిగ్గోసింది. ఇటీవల నీతి ఆయోగ్ వెల్లడించిన నివేదికలో వరి, గోధుమ అపరిమిత సేకరణ చేయొద్దని దిశా నిర్దేశం చేసింది. డబ్ల్యుటిఒ మనకు అవసరమైన పంటలను పండించనీయట్లేదు, మరోవైపు తమ వద్ద వృధాగా పడి ఉన్న ధాన్యాలను మన దేశంలోకి డంప్ చేయిస్తోంది. దిగుమతి సుంకాలను తగ్గించి మరీ మన దేశం అనుమతిస్తోంది. అమెరికాలో తినకుండా వదిలేసిన చికెన్ లెగ్ పీస్‌లపై మోడీ సర్కారు దిగుమతి సుంకాన్ని ఏకంగా 30 నుంచి 5 శాతానికి తగ్గించింది. విదేశీ చికెన్ కుప్పలు తెప్పలుగా వచ్చి పడితే మన పౌల్ట్రీ మనగలుగుతుందా? మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా పని చేస్తోంది. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం నాడు, నేడు ఢిల్లీ సరిహద్దుల్లో రైతు ఉద్యమంపై కాల్పులు, లాఠీలు, నిర్బంధం. ఇదంతా చేస్తోంది విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల కోసం. డబ్ల్యుటిఒ కోసం. బిజెపి విధానాలను రైతాంగం, అశేష ప్రజానీకం ప్రతిఘటించడమే మార్గం.

మహనీయుల మాట



విప్లవంలో ఎదురుదెబ్బలు తిన్నప్పుడూ, శత్రువు విజయం సాధించినప్పుడూ... స్థిమితం కోల్పోకుండా, కుదుపులకు గురికాకుండా వున్నవాడూ... విప్లవం వెనుకపట్టు పట్టినప్పుడు... బెదిరిపోకుండా లేక నిరాశకు గురికాకుండా వున్నవాడూ నిజమైన విప్లవకారుడు.

- స్టాలిన్

జననం : 18.12.1878
మరణం : 5.3.1953

విమర్శ

ఉదారవాద విధానాల వల్లే మురికివాడలు

కె.ఎస్.రంజిత్

అసమానతలు రాజ్యమేలుతున్న ఈ ప్రపంచంలో పేదలు ఎక్కువగా ఎక్కడ నివసిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం పల్లెలే. కానీ అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, 2035 నాటికి పట్టణాల్లోని మురికివాడలని చెప్పుకోవాల్సి వస్తుంది. 2030 నాటికి 200 కోట్ల మంది ప్రజలు పట్టణ మురికివాడలలో నివసిస్తారు.

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, ప్రపంచంలోని పట్టణ పేదలలో సగం మంది మురికివాడల్లోనే నివసిస్తున్నారు. 1980వ దశకంలో ప్రారంభమైన నయా ఉదారవాద విధానాల కారణంగా అసమానతలు తీవ్రరూపం దాల్చాయి. ఇది మురికివాడల విస్తరణకు, అక్కడ నివసించే వారి సంఖ్య పెరుగుదలకు ఆజ్యం పోసింది.

ఆధునిక పెట్టుబడిదారీ విధానం పట్టణ-కేంద్రీకృత ప్రత్యేకించి మెగా సిటీ-కేంద్రీకృత అభివృద్ధి నమూనాను ముందుకు తెచ్చింది. పెట్టుబడిదారీ విధానం అత్యున్నత రూపమైన నయా ఉదారవాద విధానాలు నిర్దేశించిన అభివృద్ధి నమూనా దేశంలో ప్రచ్ఛన్న నిరుద్యోగితను, వలసలను పెంచింది. పల్లెల్లో సామాన్యులు, ఆకలితో అలమటిస్తున్న జనం పని వెతుక్కుంటూ తమ పెట్టెలు, మంచాలు తీసుకొని నగరాలకు వెళ్లడం నేడు అన్ని దేశాల్లోనూ కనిపించే సాధారణ దృశ్యం.

పట్టణాల వృద్ధి వేగం పెరిగింది. 1950లో 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు 86 ఉండగా, 2015 నాటికి అది 550కి పెరిగింది.

1950 నుండి జనాభా పెరుగుదలలో మూడింట రెండొంతుల మంది నగరాల్లోనే నివసిస్తున్నారు. పట్టణ జనాభా కూడా అపూర్వమైన స్థాయిలో పెరుగుతోంది. నగరాల్లో ప్రతి వారం సుమారు 10 లక్షల మంది జన్మిస్తున్నారు.

పట్టణాలకు వలస వెళ్లే వారి సంఖ్య కూడా దాదాపు అంతే. గత మూడు దశాబ్దాల్లో పట్టణ కార్మికుల సంఖ్య రెట్టింపు అయింది. 1910లో లండన్ నగరం 1800లో ఉన్నదానికంటే ఏడు రెట్లు పెద్దది కాగా, ఢాకా నగరం 1950లో ఉన్నదాని కంటే 40 రెట్లు పెద్దదైంది.

నగరాల మధ్య అసమానతలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో మెగా సిటీలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో మెట్రోలు, చిన్న నగరాల మధ్య అంతరమూ పెరుగుతోంది. ఏ విధమైన ప్రణాళిక లేకుండా అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల అంచులలో పేదలు ఎక్కువగా నివసిస్తున్నారు.



నగరాల మధ్య అసమానతలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో మెగా సిటీలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో మెట్రోలు, చిన్న నగరాల మధ్య అంతరమూ పెరుగుతోంది. ఏ విధమైన ప్రణాళిక లేకుండా అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల అంచులలో పేదలు ఎక్కువగా నివసిస్తున్నారు. పని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చే వలస కూలీలు స్వచ్ఛమైన నీరు, వెలుతురు, మంచి మరుగుదొడ్లు లేని మురికివాడల్లో తల దాచుకొంటున్నారు. కొంచెం స్థిరమైన ఆదాయం ఉన్నవారు మంచి స్థలాల కోసం చూస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా బాధ్యతల నుంచి తప్పుకుంటున్న నేటి పరిస్థితుల్లో పేదల నివాసాలు అత్యంత దుర్భరమైన వాతావరణంలో వుంటున్నాయి.

పని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చే వలస కూలీలు స్వచ్ఛమైన నీరు, వెలుతురు, మంచి మరుగుదొడ్లు లేని మురికివాడల్లో తల దాచుకొంటున్నారు. కొంచెం స్థిరమైన ఆదాయం ఉన్నవారు మంచి స్థలాల కోసం చూస్తారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా బాధ్యతల నుంచి తప్పుకుంటున్న నేటి పరిస్థితుల్లో పేదల నివాసాలు అత్యంత దుర్భరమైన వాతావరణంలో వుంటున్నాయి.

ప్రపంచంలోని అతి పెద్ద మురికివాడలలో ఒకటి మహారాష్ట్రలోని ధారావి. ఇక్కడ 2.39 చదరపు కిలోమీటర్ల పరిధిలో 10 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 2.77 లక్షలు.

బ్రిటిష్ వలస పాలనలో 1884లో ధారవి ఏర్పడింది. బొంబాయిలో అప్పట్లో నెలకొల్పబడిన నేత కర్మాగారాలు, చర్మకారుల పరిశ్రమలు, ఇతర పరిశ్రమలలో పని చేయడానికి వచ్చిన కూలీలకు ధారవిలో అతి తక్కువ ధరకే వసతి దొరికేది. మిగతా మురికివాడల కథలూ దాదాపు ఇలాగే ఉంటాయి.

వ్యవసాయంలో సరళీకరణ విధానాలను అమలు చేయడంతో నగరాలకు వలసలు తీవ్రంగా పెరిగాయి. రాయితీలను దశలవారీగా రద్దు చేసి, ధరల నియంత్రణను మార్కెట్ శక్తులకు వదిలేయడంతో అది వ్యవసాయంలో స్తబ్దతకు దారితీసింది.

దిగుమతులపై ఆంక్షల ఎత్తివేత వల్ల అనేక వ్యవసాయ ఉత్పత్తులకు పెద్ద దెబ్బ తగిలింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. మనుగడ సాగించడానికి 'నగరాలకు వెళ్లడం' తప్పనిసరి అయింది.

అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా ఐఎమ్ఎఫ్ సిఫార్సులకు అనుగుణంగా సంస్కరణలను అమలు చేయవలసి వచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయి.

లాటిన్ అమెరికా, ఆఫ్రికాలలో రైతులను ఆధునీకరించే ప్రణాళికలు విడిచిపెట్టేశారు.

ఆఫ్రికా వంటి దేశాల్లో అనుసరించిన విధానాలు స్థానిక అన్ని స్థానిక రక్షణలను రద్దు చేయడంతో, పేద రైతులు కరువులు, వరదలు, ధరల హెచ్చుతగ్గులతో కుదేలవుతున్నాయి. కంబోడియాలో 60 శాతం మంది చిన్నకారు రైతులు తమ భూములను అమ్ముకుని, వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు నగరాలకు వెళ్లాల్సి వచ్చింది. వ్యవసాయ సంక్షోభం, అది సృష్టించిన ఆర్థిక పతనం అంతర్యుద్ధాలకు దారితీసింది. ఆఫ్రికాలోని అనేక ప్రాంతాలలో వ్యవసాయం పూర్తిగా నాశనమైంది. ఈ విధంగా సృష్టించబడిన తీవ్ర పేదరికం కారణంగా మురికివాడలు పెరిగాయి.

సామాజిక శాస్త్రవేత్తలు 19వ శతాబ్దపు మురికివాడలను పారిశ్రామికీకరణ ఉప-ఉత్పత్తిగా భావించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో నేటి మురికివాడల పెరుగుదల పేదరికం, వ్యవసాయ క్షీణత కారణంగా ఏర్పడినదే.

ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఇథియోపియా పట్టణ జనాభా మురికివాడల్లో అత్యధికంగా వుంటోంది (పట్టణ నివాసులలో 99.4 శాతం). చాద్ (99.4 శాతం), ఆఫ్ఘనిస్తాన్ (92 శాతం)గా వుంది. మహానగరాల్లో పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. బాంబే (12 లక్షల మంది), ఢాకా (10 లక్షలు), మెక్సికో (10 లక్షలు), లాగోస్, కైరో, కరాచీ, ఢిల్లీ (6 నుండి 8 లక్షలు) మురికివాడల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు.

పూర్వ సోవియట్ యూనియన్, రష్యాలోని వివిధ ప్రాంతాలలో మురికివాడలు వేగంగా ఏర్పడుతున్నాయి. నేడు ప్రపంచంలో 2 లక్షలకు పైగా మురికివాడలు ఉన్నాయి. ఒక్కో మురికివాడలో 1000 నుండి 10 లక్షల మందికి పైగా ఉవుంటున్నారు. ఒక్క దక్షిణాసియా దేశాల్లోనే దాదాపు 20,000 మురికివాడలు ఉన్నాయి. అవి ఆకలి కేంద్రాలని చెప్పుకోవచ్చు.

బ్రిటిష్ వలస పాలనలో వున్న దేశాలలో మురికివాడలు పెద్దఎత్తున ఏర్పడ్డాయి. వ్యవసాయ, ఆర్థిక వ్యవస్థల విధ్వంసం, భారీ పన్ను విధింపు కారణంగా వలస పాలన సాగిన దేశాల గ్రామీణ ప్రాంతాలలో బతకడమే కష్టమైంది.

జనాభాను మురికివాడల్లోకి నెట్టాయి. కనీస అవసరాలైన తాగు నీరు, పారిశుధ్యం వంటివి చాలా అధ్వానంగా వుంటాయి. అంటువ్యాధులు ప్రబలడానికి ఇది ఆసరా ఇస్తుంది. ప్రతి అంటువ్యాధి మరిన్ని ఎక్కువ 'మురికివాడలను' సృష్టించింది.

పట్టణీకరణ వల్ల మురికివాడలు అనివార్యంగా ఏర్పడతాయా? అంటే కాదనే ఉదాహరణలు కూడా ఉన్నాయి. విప్లవానంతర క్యూబా దీనికి తిరుగులేని ఉదాహరణ.

ఫైడల్ కాస్ట్రో కమ్యూనిస్ట్ ప్రభుత్వం...విప్లవానికి ముందు మురికివాడలలో నివసించిన వారికి సాపేక్షంగా మెరుగైన గృహాలను నిర్మించింది. వారికి కనీస జీవన సౌకర్యాలు కల్పించింది. పట్టణ వలసలు ఎక్కువగా జరిగిన చైనా కూడా విభిన్నంగా వ్యవహరించింది. పట్టణాలకు వలస వచ్చిన వారికి గృహాలు, పారిశుధ్య సౌకర్యాలు అందించింది.

1950వ, 60వ దశకంలో, అనేక దేశాల్లో జనాదరణ పొందిన ప్రభుత్వాలు అదే దిశలో పయనించాలని కోరుకున్నాయి. అందుకు ప్రయత్నించాయి కూడా. కానీ పాలక వర్గ ప్రయోజనాలు చాలా చోట్ల వీటిని అడ్డుకున్నాయి. ఈ కాలంలోనే కొన్ని దేశాలు తమ రాజ్యాంగాలలో సోషలిజాన్ని సాధించడం లక్ష్యంగా రాసుకున్నాయి.

కానీ 1980ల నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు కేవలం ఆర్థికాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా చేసుకునే నయా ఉదారవాద విధానాల్లో చిక్కుకున్నాయి. దాంతో పేదరిక నిర్మూలన, మురికివాడల నిర్మూలన, ప్రజారోగ్యం, ప్రభుత్వ విద్యను అందించడాన్ని ఎజెండా నుంచి తొలగించారు.

అసమానతల యుగం ప్రారంభమైంది. ప్రభుత్వాల ఉదాసీనత కూడా దీనికి తోడైంది. ఈ నేపథ్యంలో పౌరులకు నీరు, విద్యుత్, విద్య, పారిశుధ్యం, గృహాలకు హామీ ఇచ్చే ప్రభుత్వాలు మాత్రమే మురికివాడలలోని దుర్భర జీవితం నుండి ప్రజలను రక్షించగలవు.

('థాట్ వీక్లీ' నుండి)

★

కవిత్వం

అన్నార్తులపై అరివీర ప్రతాపాలు

తమది కాని పోరులో
శిథిలమైన ఊరిలో..
మిగిలివున్న చూరు కింద
పగటి కలల పౌరుడు
పక్కలోన బాంబు పడ్డా
చెక్కు చెదరని ఆశతో
తనువు చిక్కి శల్యమైనా
చిక్కనైన నవ్వుతో
చక్కగా కలగంటున్నాడు
ఎండివున్న డొక్కకు
ట్రక్కులతో తిండి దొరికినట్టు
డస్సిన దేహానికి దప్పిక తీరినట్టు
ఒక్కడి కల కాదిది.. ఊరుమ్మడి కల
నిస్సహాయ సమూహాలకు
నిషిద్ధమైన కల
కలలు నిండిన కళ్ళ ముందుకు
ట్రక్కు ఉరికి వచ్చినపుడు
మూకుమ్మడిగా ఆకలి,
చేయిచాచి ముందుకొచ్చే
వేల కొలది ప్రేవులన్నీ
ఆవురావురుమని పెనుగులాడే
చేతికి చేరనే లేదు తిండి పిండి పొట్లాలు
గుండెను తూట్లు పొడిచేను యుద్ధ సేన తూటాలు
అన్నార్తులపై అరివీర ప్రతాపాలు
ఆకలి తీరిందేమో విగత జీవి దేహాలకు
అయినా రక్తదాహం తీరనే లేదు ఆ 'ఆధునిక' దేశాలకు.

- డా॥ డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ. సెల్ : 9440836931

(ఆహార పదార్థాల కోసం సహాయక ట్రక్కుల వెనక పరుగులు పెట్టిన గాజా పౌరులపై ఇజ్రాయిల్ కాల్పులు జరపగా 100 మంది మృతి చెందారన్న వార్త చదివి...)

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

విశ్లేషణ

అన్ని పంటలకూ, అన్ని కాలాల్లో ఎంఎస్‌పి

ఎం. హరిబాబు

పంజాబ్, హర్యానా రైతులు ఈ నెల 13 నుండి ఢిల్లీ శింబు సరిహద్దు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. 2021లో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. రైతు ఉద్యమం మీద అనేకమంది మేధావులు రకరకాల ప్రశ్నలతో, సందేహాలతో, ప్రజల్లో పొరపాటు అభిప్రాయాలు కలిగిస్తున్నారు. డా॥ స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం...23 పంటలకు కనీస మద్దతు ధర సి2+50 శాతం ప్రకారం ఇవ్వాలని రైతులు అడుగుతున్నారు. మోడీ ప్రధాని కాకముందే ఎన్నో సభల్లో మాట్లాడుతూ.. 'స్వామినాథన్ కమిషన్ సిఫారసులను కాంగ్రెస్ అమలు చేయలేకపోయింది. అధికారంలోకి వచ్చాక మేము అమలు జరిపి తీరుతాం' అని హామీ ఇచ్చారు. ప్రధాని అయ్యాక కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి) అమలు చేయలేదు. పైగా తమ ప్రభుత్వం ఎమ్ఎస్‌పిని అమలు చేయలేదని సుప్రీంకోర్టుకు రాత పూర్వక అఫిడవిట్ ఇచ్చారు. 2020లో 13 నెలలకు పైగా జరిగిన ఆందోళన అనంతరం ప్రధాని ప్రజలకు క్షమాపణ చెప్పారు. కనీస మద్దతు ధరలు అమలు చేస్తామని చెప్పడమేగాక...మరోసారి మరికొన్ని హామీలు ఇచ్చారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. దీంతో రైతు ఉద్యమం మళ్లీ ప్రారంభమైంది.

మద్దతు ధర ఇస్తే అభివృద్ధి అటకెక్కుతుందట!

కనీస మద్దతు ధర 23 పంటలకు ఇవ్వాలంటే రూ.10 లక్షల కోట్ల నుండి రూ.17 లక్షల కోట్లు అవసరమవుతాయని కొంతమంది మేధావులు తప్పుడు లెక్కలతో ప్రచారం చేస్తున్నారు. ఇది అమలు జరిగితే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని, ద్రవ్యోల్బణం పెరుగుతుందని, విద్య, వైద్యం, అభివృద్ధి, దెబ్బ తింటుందని అంటున్నారు. ఇవేమీ వాస్తవం కాదు. ఆర్థికవేత్త క్రిసిల్ అంచనా ప్రకారం...రూ.21 వేల కోట్లు వెచ్చిస్తే భారత రైతాంగం మొత్తానికి కనీస మద్దతు ధరలు ఇవ్వగలమని చెప్తున్నారు. మన ప్రధాని 55 నెలల్లో 92 దేశాల పర్యటనకుగాను భారత ప్రభుత్వం రూ.254 కోట్లు ఖర్చు పెట్టింది. ప్రధాని దుస్తుల కోసం రూ.100 కోట్ల పైనే ఖర్చు పెట్టింది. మేధావులు ఈ ఖర్చు గురించి మాత్రం మాట్లాడరు. రైతాంగంపై ఖర్చు పెట్టే విషయంపైన దుష్ప్రచారం చేస్తారు. మార్కెట్లోకి వచ్చిన ప్రతి పంటనూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయదు. ప్రభుత్వానికి అవసరమైనంత వరకే మద్దతు ధరకు కొంటుంది. మిగిలిన పంటను మార్కెట్ శక్తులే కొంటాయి. ప్రభుత్వం చట్టం చేయకపోతే మార్కెట్ శక్తులు సిండికేట్‌గా మారి ధరను పతనం చేస్తాయి. అనంతరం కృత్రిమ డిమాండ్ సృష్టించి...అవే అధిక ధరలకు ప్రజలకు అమ్ముతాయి. కనీస మద్దతు ధరల చట్టం లేకపోతే రైతుకూ, వినియోగదారుడికీ ఇద్దరికీ నష్టమే.

మార్కెట్లోకి వచ్చిన ప్రతి పంటనూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయదు. ప్రభుత్వానికి అవసరమైనంత వరకే మద్దతు ధరకు కొంటుంది. మిగిలిన పంటను మార్కెట్ శక్తులే కొంటాయి. ప్రభుత్వం చట్టం చేయకపోతే మార్కెట్ శక్తులు సిండికేట్‌గా మారి ధరను పతనం చేస్తాయి. అనంతరం కృత్రిమ డిమాండ్ సృష్టించి... అవే అధిక ధరలకు ప్రజలకు అమ్ముతాయి. కనీస మద్దతు ధరల చట్టం లేకపోతే రైతుకూ, వినియోగదారుడికీ ఇద్దరికీ నష్టమే.

కారుచౌకగా కొని.. నషాళానికంటే ధరకు...

కిన్నో పండును రైతు నుండి 5 రూపాయలకు కొని సూపర్ మార్కెట్లు అదే పండును రూ.50కి అమ్ముతున్నాయి. కనీస మద్దతు ధర చట్టం లేదు కాబట్టి అతి తక్కువ ధరకు కొని 10 రెట్లు పెంచి దళారులు అమ్ముకుంటున్నారు. బస్తా ధాన్యం రూ. 1600 పెట్టి కొంటే కిలో బియ్యం రూ.28కి అమ్మవచ్చు. ప్రస్తుతం కిలో బియ్యం సుమారు రూ.60 ఉంది. ధాన్యాన్ని కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.2,183 పెట్టి కొనడం లేదు. కేజీ బియ్యం రూ.28కీ అమ్మడంలేదు. బీహార్‌లో మార్కెటింగ్ వ్యవస్థ ఎప్పుడో దెబ్బతింది. అక్కడ పంటలకు ధరలు తక్కువగా వస్తున్నాయి. వరికి కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,183 మద్దతు ధర ప్రకటించింది. స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారమైతే వరికి క్వింటాకు రూ.2,838 రావాల్సి ఉంది. బీహార్‌లో మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల క్వింటా వడ్లను రూ.1200కి అంతకంటే తక్కువకు కొని..అదే వ్యాపారులు పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలించి రూ.2,183 మద్దతు ధర పొందుతున్నారు. అలాగే గోధుమలకు కేంద్ర ప్రభుత్వం రూ.2,125 మద్దతు ధర ప్రకటించింది. మార్కెట్లో దళారులు రూ.1800 అంతకంటే తక్కువ ధరకు కొంటున్నారు. దీన్నిబట్టే దళారులు ఏ విధంగా దోచుకుంటున్నారో గమనించవచ్చు. మార్కెట్లో డిమాండు- సరఫరాను బట్టి ధరల్లో మార్పులు వస్తుంటాయి. దానిని కనీస మద్దతు ధరల చట్టం ద్వారా కట్టడి చేయవచ్చు.

అటకెక్కిన నివేదికలు

14 శాతం మంది రైతులు కనీస మద్దతు ధర పొందుతున్నారని పార్లమెంట్లో ప్రభుత్వం చెప్పింది. ఆరు శాతం మంది రైతులే ఎంఎస్‌పి పొందుతున్నారని శాంత కుమార్ కమిటీ చెప్పింది. చాలా తక్కువ మంది రైతాంగం మద్దతు ధరలు పొందుతున్నారు కనుక అసలు మద్దతు ధర వ్యవస్థనే రద్దు చేద్దామని కొంతమంది ప్రతిపాదిస్తున్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన విషయం. పార్లమెంట్ లెక్కలే తీసుకుంటే 86 శాతం మంది రైతులు మద్దతు ధరలు పొందలేక నష్టపోతున్నారు. మార్కెట్ శక్తుల మీద ఆధారపడుతున్నారు. తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారు. పంట ఉత్పత్తి ఖర్చులు, పంట పంటకూ, ప్రాంతానికి ప్రాంతానికీ వేర్వేరుగా ఉంటుంది కాబట్టి..అన్ని పంటలకూ అన్ని ప్రాంతాలకూ కనీస మద్దతు ధరలు నిర్ణయించడం, చట్టం చేయడం ప్రభుత్వానికి కష్టంగా ఉంటుందంటున్నారు. 1980లో పంజాబ్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్ఎస్ జోహల్ పంటల వైవిధ్యం మీద రిపోర్టును ప్రభుత్వానికి అందించారు. ప్రధాని ఆర్థిక సలహాదారు డాక్టర్ అరవింద సుబ్రమణ్యన్ అపరాల మీద 2016లో నివేదిక ఇచ్చారు. ఈ కమిటీల రిపోర్టులను అటకెక్కించారు. ఉత్పత్తి ఖర్చులు మరీ ఎక్కువగా వున్న చోట రాష్ట్ర ప్రభుత్వం కొంత భాగాన్ని భరించి, తద్వారా రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేరళ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర అందించడానికి గాను...ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు కొంత బోనస్‌గా ప్రకటించి రైతులకు ఇస్తున్నాయి.

మన దేశంలో సబ్సిడీలు చాలా తక్కువ

స్పెయిన్ దేశంలో కనీస మద్దతు ధరల చట్టం ఉంది. అక్కడ అన్ని పంటలు కనీస మద్దతు ధరకంటే తక్కువగా కొనకుండా చట్టం ఉంది. మరికొన్ని దేశాలు రైతుల కోసం ఇతోధికంగా సబ్సిడీలు ఇస్తున్నాయి. అమెరికాలో ఏడాదికి రైతుకు రూ.79 లక్షలు సబ్సిడీ రూపంలో ఇస్తున్నారు. యూరోప్‌లో 100 బిలియన్ డాలర్లు సబ్సిడీగా ఇస్తున్నారు. మన దేశంలో కొద్దిమంది రైతులకు మాత్రమే రూ.6 వేలు నగదు సబ్సిడీగా ఇస్తున్నారు. అదీ రకరకాల ఆంక్షలు పెట్టి. లబ్ధిదారుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తున్నారు. స్వామినాథన్ చెప్పినట్లు... మద్దతు ధరలు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా ఇవ్వాల్సిందేనా అనే ప్రశ్న వస్తోంది. ఐదు లేదా పది శాతానికి తగ్గించుకోవచ్చు కదా అనే వాదనలూ ఉన్నాయి. జాతీయ వ్యవసాయ విధానాల విశ్లేషకులు దేవేంద్ర శర్మ చెబుతున్నది ఏమంటే.. మందుల కంపెనీలు 500 శాతం లాభాలు పోగేసుకుంటుంటే అభ్యంతరం చెప్పడంలేదు. ఇతర పరిశ్రమలూ వంద నుంచి 500 శాతం వరకు లాభాలు ఆర్జిస్తున్నాయి. అలాంటప్పుడు రైతుల ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా ఇవ్వడంలో తప్పేముంది?

రైతు సగటు కుటుంబ ఆదాయం హీనం

భారతీయ రైతు సగటు కుటుంబ ఆదాయం నెలకు రూ.10,218. దీనిలోనే తన కుటుంబంలోని ఇతర సభ్యులు చేసే ఇతర వృత్తుల ఆదాయమూ కలిపి ఉంది. ఒక జాతీయ సర్వే రిపోర్టు ప్రకారం...17 రాష్ట్రాలలో సర్వే చేస్తే కేవలం వ్యవసాయం ద్వారా ఒక్కో రైతు కుటుంబానికి నెలకు వస్తున్న ఆదాయం రూ.1700. ఈ సర్వే ప్రకారం దేశంలో సగానికి పైగా రైతులు నెలకు రూ.1700 మాత్రమే పొందుతున్నారు. అంటే రోజుకు సుమారుగా రూ.27 ఆదాయంతో భారతీయ రైతు కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇది ఎంత చిన్న మొత్తం? రైతు కుటుంబాలు ఎలా బతుకుతాయి? పరిశీలించాల్సిన అవసరం సమాజం మీద ఉంది. ప్రభుత్వాలు 'హరిత విప్లవం', 'నీలి విప్లవం' అంటూ ఉత్పత్తినీ ఉత్పాదకతనూ పెంచటానికి ప్రణాళికలు వేశాయిగాని, రైతుల సంక్షేమం కోసం, వారి మెరుగైన జీవితం కోసం ఏ ప్రణాళికలూ వేయలేకపోయాయి.

కార్పోరేట్లకు రుణమాఫీ చేసినప్పుడు గుర్తురాదా

మద్దతు ధరలు అమలు చేస్తే దేశంలో 80 కోట్ల మంది ప్రజలకు ఇస్తున్న సబ్సిడీలు ప్రభుత్వానికి భారమవుతాయి కదా అంటున్నారు కొందరు. వారందరికీ పంటలు పండించేది రైతులే. నిజానికి దేశ జనాభాలో రైతులూ అంతర్భాగంగా ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలి. నగదు బదిలీ లేదా కనీస ధర ఏదో ఒకటి అమలు చేస్తే చాలు కదా అంటే రెండూ కావాలంటున్నారు దేవేంద్ర శర్మ. ఇలా చేస్తే విద్యా, వైద్యం, అభివృద్ధికి ఆటంకం అవుతుందనే వారు, పురాతన భావాలతో బతికేవారు ఈ కాలానికి అనుగుణంగా మారాలంటారాయన. పరిశ్రమలు తమ వ్యక్తిగత లాభాల కోసం నడుపుతున్నారు. రైతులు దేశ ప్రజలకు అన్నం పెట్టడానికి వ్యవసాయం చేస్తున్నారు. దేశంలో బడా కార్పొరేట్ కంపెనీలకు రూ.14 లక్షల కోట్లు మాఫీ చేసినప్పుడు ఈ మేధావులకు విద్యా, వైద్యం, అభివృద్ధి గుర్తుకు రాకపోవడం దురదృష్టకరం.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కొత్తగా వచ్చినపుడు కూడా వీరంతా గగ్గోలు పెట్టారు. ఉపాధి హామీ పథకం వల్ల కూలి పెరిగి, వలసలు తగ్గి కొంతమందైనా గౌరవప్రదంగా బతుకుతున్నారన్నది వాస్తవం. అయితే ఇదే బాపతుకు చెందిన కొందరు...రైతు ఉద్యమాలపై విడ్డూరమైన వాదనలు చేస్తున్నారు. రైతుల ముసుగులో భద్రతా సిబ్బందిపై రాళ్లు విసిరినట్లు, ఆందోళన జరిగిన ప్రాంతాల్లో ట్రాక్టర్ల కంటే ఖరీదైన వాహనాల్లో వచ్చినట్లు, చట్టాన్ని వీరు చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే హర్యానా పోలీసులు తమ సరిహద్దు దాటి (పోలీసు మాన్యువల్‌ను అతిక్రమించి) పంజాబ్ సరిహద్దులకు వెళ్లి జరిపిన తుపాకీ కాల్పుల్లో యువ రైతు శుభ కరణ్‌సింగ్ చనిపోయినది మాత్రం వారికి కనిపించలేదు. సోషల్ మీడియా అకౌంట్లు రద్దు చేయడం వారికి తప్పనిపించలేదు. వాస్తవానికి రైతులు ఎక్కడా చట్టాన్ని చేతిలోకి తీసుకోలేదు. ప్రభుత్వమే జల ఫిరంగులను, బాష్పవాయు గోళాలను, రబ్బర్ తూటాలుతోపాటు, ఒక కొత్త రకం రసాయనాన్ని గాలిలోకి వదిలి రైతుల కళ్లూ చెవులూ దెబ్బతినేలా చేసింది. ఇది భారత ప్రజల మీద, ప్రజలందరికీ ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే వారి పైన చేయాల్సిన పనేనా అని సభ్య సమాజం ఆలోచించాలి. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల సమస్యలను పరిష్కరించి, కనీస మద్దతు ధర చట్టం చేస్తేనే డా॥ఎంఎస్ స్వామినాథన్‌కు ఇచ్చిన భారతరత్నకు సార్థకత.

(వ్యాసకర్త ఎ.పి కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి)

జిల్లా, మండల స్థాయిల్లో

మహా పంచాయత్‌లు

- 14న ఢిల్లీ కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌పై ఇంటింటి ప్రచారం
- అజయ్ మిశ్రాకు ఎంపి సీటును నిరసిస్తూ టార్చ్ లైట్ ప్రదర్శనలు
- 8న మహిళా సంఘాలతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో ఈ నెల 14న జరిగే కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌కి ముందు దేశవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిల్లో మహా పంచాయత్‌లు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఖేరీ లోక్‌సభ సీటు లఖింపూర్ ఖేరీ రైతుల ఊచకోత కేసులో ప్రధాన నిందితుడు ఆశిష్ మిశ్రా తండ్రి అజయ్ మిశ్రాకు బిజెపి ఇవ్వడాన్ని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2021 అక్టోబర్ 3న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై ఆశిష్‌మిశ్రా, అతని అనుచరులు వాహనాలు ఎక్కించి క్రూరంగా దాడి చేశారు. దీంతో, రైతులు నక్షత్ర సింగ్, లవ్‌ప్రీత్ సింగ్, దల్జీత్ సింగ్, గుర్విందర్ సింగ్, జర్నలిస్ట్ రామన్ కశ్యప్ మరణించారని గుర్తు చేసింది. సెక్షన్ 102 ఐపిసి కింద అజయ్ మిశ్రాను తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలని, శిక్షను నిర్ధారించాలని రైతుల ఉద్యమం డిమాండ్ చేసిందని తెలిపింది. మోడీ ప్రభుత్వం ఆయనను కాపాడుతోందని, సుప్రీం కోర్ట్ జోక్యం తర్వాత, ప్రధాన నిందితుడు ఆశిష్ మిశ్రాను అరెస్టు చేశారని తెలిపింది. గత పదేళ్లలో ప్రజల జీవనోపాధిని అణిచివేస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, యువకులు, విద్యార్థులు చేపట్టిన ప్రజా ఆందోళనను అణిచివేసేందుకు బిజెపి ధనబలం, కండబలాన్ని ప్రయోగించింది. కార్పొరేట్ – అవినీతి ధన బలంతో అసమ్మతిని తగ్గించడానికి, రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని అణిచివేసేందుకు, కార్పొరేట్ ప్రాయోజిత మీడియాను ఉపయోగించి ప్రధాని మోడీ గ్రాఫ్ పెంచే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. అజయ్‌మిశ్రా అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా, మోడీ హయాంలో కార్పొరేట్–నేరసంబంధమైన బంధాన్ని బహిర్గతం చేయడానికి దేశవ్యాప్తంగా గ్రామాలలో టార్చ్ లైట్ ప్రదర్శన నిర్వహించాలని ఎస్‌కెఎం రైతులకు పిలుపునిచ్చింది. నిరసన తేదీని ఎస్‌కెఎం సంబంధిత రాష్ట్ర సమన్వయ కమిటీలు నిర్ణయిస్తాయని తెలిపింది. రాంలీలా మైదాన్‌లో ఈనెల 14న జరగనున్న కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌లో కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక, ఇతర వర్గాల ప్రజా సంఘాలతో ఎస్‌కెఎం కార్యాచరణను ప్రకటిస్తుందని తెలిపింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి రైతులు రాంలీలా మైదాన్‌కు భారీగా తరలివస్తారని పేర్కొన్నారు. ఈ కాలంలో సుదూర రాష్ట్రాల రాష్ట్ర సమన్వయ కమిటీలు పాదయాత్ర, ఇంటింటి ప్రచారం, జిల్లా, మండల స్థాయి మహా పంచాయత్‌ను నిర్వహించనున్నట్లు తెలిపింది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (బిఐఎఫ్ఎఫ్)లో కేసరి హరవు దర్శకత్వం వహించిన ఢిల్లీ సరిహద్దుల్లో 2020–21 చారిత్రాత్మక రైతుల పోరాటంపై కిసాన్ సత్యాగ్రహ చిత్రంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిషేధాన్ని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. ఎస్‌కెఎం దీనిని రాజ్యాంగంలో పొందుపరిచిన భావప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలను నిరాకరించే నిరంకుశ చర్యగా పరిగణిస్తుందని తెలిపింది. నిషేధాన్ని వీలైనంత త్వరగా ఎత్తివేయాలని మోడీ ప్రభుత్వాన్ని ఎస్‌కెఎం డిమాండ్ చేసింది. మహిళా సంఘాలు, ఇతర బహుజన సంఘాలతో సమన్వయం చేసు కుంటూ ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని దేశవ్యాప్తంగా రైతులకు ఎస్‌కెఎం పిలుపునిచ్చింది. మహిళా రైతులందరికీ ఎస్‌కెఎం శుభాకాంక్షలు తెలియజేసింది. మహిళల విముక్తి కోసం పని చేయడానికి, మహిళలపై అన్ని రకాల అఘాయిత్యాలు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేసింది.

మహా పంచాయతీలో వ్యవసాయ కార్మిక సంఘాలు

ఈ నెల 14న ఢిల్లీలో జరిగే కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌లో వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొనున్నాయి. ఈ మేరకు సోమవారం బి.వెంకట్ (ఎఐఎడబ్ల్యుయు), గుల్జార్ సింగ్ గోరియా (బికెఎంయు), అసిత్ గంగూలీ (ఎఐఎస్‌కెఎస్), ధీరేందర్ ఝా (ఎఐఎఆర్ఎల్ఎ), ధర్మేందర్ (ఎఐకెఇఎస్‌యు) సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేసేందుకు కిసాన్ మజ్దూర్ మహా పంచాయతీలో వ్యవసాయ, గ్రామీణ కార్మికులు భారీ స్థాయిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థినులపై యాసిడ్ దాడి

- నిందితుడి అరెస్టు

మంగళూరు : కర్ణాటకలోని మంగళూరులో పరీక్ష కోసం వెళ్లిన ముగ్గురు విద్యార్థినులపై ఓ యువకుడు యాసిడ్‌తో దాడి చేశాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. గాయపడిన విద్యార్థినులను స్థానిక ఆసుపత్రికి తరలించామని, వారికి ప్రాణాపాయం లేదని తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లా కడబాలోని ప్రభుత్వ పీయూ కళాశాలకు పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థినిపై 23 ఏళ్ల అబిన్ యాసిడ్‌తో దాడి చేశాడు. ఆ సమయంలో పక్కనే వున్న మరో ఇద్దరు విద్యార్థినులు సైతం గాయపడ్డారు. స్థానికులు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూర్ తాలూకాకు చెందిన అబిన్ (23) ఎంబిఎ చదువుతున్నాడు. అతనికి కేరళ నుంచి వచ్చి, మంగళూరు కళాశాలలో చదువుతున్న విద్యార్థినితో అంతకుముందే పరిచయం ఉంది. తనతో రిలేషన్ షిప్ వద్దని విద్యార్థిని చెప్పడంతో ఆమెపై యాసిడ్ దాడికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు.

సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసినా ఆగని బిజెపి కుట్రలు

- చండీగఢ్ సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు కైవసం

చండీగఢ్ : సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినా చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బిజెపి తీరు మారలేదు. ఆప్ కౌన్సిలర్లను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా సోమవారం జరిగిన ఎన్నికల్లో సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను బిజెపి గెలుచుకుంది. సోమవారం ఎన్నికలయ్యే వరకూ ముగ్గురు ఆప్ కౌన్సిలర్లను బిజెపి అజ్ఞాతంలోనే ఉంచింది. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బిజెపి నియమించిన ప్రిసైడింగ్ అధికారి అనిల్ మసీహ్ ఆప్ కౌన్సిలర్ల ఓట్లను చెల్లనవిగా చేసి, బిజెపి అభ్యర్థిని మేయర్‌గా ఎన్నికైనట్లు ప్రకటించడం దేశవ్యాప్తంగా విస్మయం కలిగించింది. ఆప్–కాంగ్రెస్ ఫిర్యాదుతో దీనిపై విచారణ చేసిన సుప్రీంకోర్టు బిజెపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫలితాలను రద్దు చేసి, ఆప్–కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కులదీప్ కుమార్‌ను మేయర్‌గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. పటిష్టమైన భద్రత మధ్య ఈ ఎన్నికలు జరిగాయి. తుది ఫలితాల్లో సీనియర్ డిప్యూటీ మేయర్‌గా బిజెపి అభ్యర్థి కుల్దీప్ సింగ్ సంధు మూడు ఓట్ల తేడాతోనూ, డిప్యూటీ మేయర్‌గా బిజెపి అభ్యర్థి రాజిందర్ శర్మ రెండు ఓట్ల తేడాతోనూ గెలుపొందారు. చండీగఢ్‌లో మొత్తం 35 మంది కౌన్సిలర్లల్లో ఆప్–కాంగ్రెస్‌కు 20 మంది, బిజెపికి 14 మంది, శిరోమణి అకాలీదళ్‌కు ఒక కౌన్సిలర్ ఉన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బ్యాంక్ ఆఫ్ బరోడా

నరసరావుపేట బ్రాంచ్, డి.నెం.9-9-25, బ్యాంక్ వీధి, అరండల్‌పేట, నరసరావుపేట-522601, పల్నాడు జిల్లా, ఆం.ప్ర., ఫోన్ నెం.08647-220576, E Mail: narasa@bankofbaroda.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన అనుబంధం-4-ఎ (రూల్స్ 6(2) & 8(6) చూడగలరు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) నిబంధనలు క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు)/హామీదారులకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్‌డ్ చేయబడి **బ్యాంక్ ఆఫ్ బరోడా** యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే"** మరియు **'ఏదైతే ఉన్నదో అదే'** ప్రాతిపదికన **21.03.2024** తేదిన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/సెక్యూర్డ్ ఆస్తు(లు)/బకాయి మొత్తము/రిజర్వు ధర/ఇ-వేలం బిడ్ పెంపుదల మొత్తము వివరములు ఈ దిగువ చెప్పబడినది.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా	బకాయి మొత్తము	ఇ-వేలం తేది మరియు సమయం	స్వాధీనం యొక్క స్వభావము నిర్మాణాత్మకం / భౌతికం	ఆస్తి తనిఖీ యొక్క తేది & సమయం
ఋణగ్రహీత : శ్రీ రామిశెట్టి బొల్లయ్య (లేటు), తండ్రి : ఆర్.రాములు డి.నెం.13-1-1/ఎ, ఫ్లాట్ నెం.502 లేదా ఎఫ్2, 4వ అంతస్తు, శ్రీనివాస టవర్స్, 60 అ॥ల రోడ్, ప్రకాశ్ నగర్, నరసరావుపేట-522601. **సహ-ఋణగ్రహీత & చట్టరీత్యా వారసులు : శ్రీమతి రామిశెట్టి వెంకట లక్ష్మి, భర్త : రామిశెట్టి బొల్లయ్య (లేటు),** డి.నెం.13-1-1/ఎ, ఫ్లాట్ నెం.502 లేదా ఎఫ్2, 4వ అంతస్తు, శ్రీనివాస టవర్స్, 60 అ॥ల రోడ్, ప్రకాశ్ నగర్, నరసరావుపేట-522601. **ఋణగ్రహీతకు చట్టరీత్యా వారసులు: మిస్ రామిశెట్టి వి ఎస్ ఎల్ ఇ హెచ్ ఆర్ తేజశ్విని, తండ్రి: రామిశెట్టి బొల్లయ్య (లేటు),** డి.నెం.13-1-1/ఎ, ఫ్లాట్ నం: 502 లేదా ఎఫ్2, 4వ అంతస్తు, శ్రీనివాస టవర్స్, 60 అ॥ల రోడ్, ప్రకాష్ నగర్, నరసరావుపేట-522601. **ఋణగ్రహీతకు చట్టరీత్యా వారసులు: మిస్ రామిశెట్టి ధరణి, తండ్రి: రామిశెట్టి బొల్లయ్య (లేటు),** డి.నెం.13-1-1/ఎ, ఫ్లాట్ నెం.502 లేదా ఎఫ్2, 4వ అంతస్తు, శ్రీనివాస టవర్స్, 60 అ॥ల రోడ్, ప్రకాశ్ నగర్, నరసరావుపేట-522601.	తేది.29.02.2024. నాటికి రూ.31,82,500/- (అక్షరాలా ముప్పై ఒక్క లక్షల ఎనభై రెండు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే). + తేది.01.03.2024 నుండి వర్తించని వడ్డీ + బకాయిలు పూర్తిగా వసూలు అగునంత వరకు ఇతర ఛార్జీలు ఉన్నచో కలిపి.	21.03.2024 మ॥ 02.00 గం.ల నుండి సా॥ 06.00 గం.ల వరకు	భౌతికంగా	తేది.16.03.2024 (బ్యాంకు పనివేళలలో తనిఖీ చేసుకోగలరు)

స్థిరాస్తుల వివరములు	రిజర్వు ధర :	ధరావత్తు :	బిడ్ పెంపుదల:
గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా), నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా,నరసరావుపేట మున్సిపల్ ఏరియా. **ఎ–షెడ్యూలు :** ప్రకాశ్ నగర్, 60 అ॥ల రోడ్, పాత డోర్ నెం.12-13-160, ప్రస్తుత డోర్ నెం.13-1-1/ఎ. మున్సిపల్ పాత వార్డు నెం.3, కొత్త వార్డు నెం.10, ప్రస్తుత వార్డు నెం.4, పాత సర్వే నెం.315/ఎ, ఎకరా.9.80 సెంట్లు, టి ఎస్ నెం.1553/6, బ్లాక్ నెం.2/26, పాత అసెస్‌మెంట్ నెం.488, కొత్త అసెస్‌మెంట్ నెం. 1024022078 వద్ద 298.66 చ॥గ॥లు లేదా 249.67 చ॥మీ॥లు. **హద్దులు : తూర్పు :** ముడియాల ఆదిలక్ష్మి గారి ఆస్తి-84'-00", **దక్షిణం :** చందలూరి నాగయ్య & ఇతరుల ఆస్తి-32'-00", **పడమర :** కొండవీటి ఏకాంబరం & చీమల లక్ష్మమ్మ గార్ల ఆస్తి-84'-00", **ఉత్తరం :** 20' వెడల్పు మున్సిపల్ రోడ్. **బి–షెడ్యూలు : "శ్రీనివాస టవర్స్"** అపార్టుమెంట్ నందలి 298.66 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలములో 29.866 చ॥గ॥ల విస్తీర్ణం గల అవిభాజ్యపు వాటా గల 4వ అంతస్తు నందలి ఫ్లాట్ నెం.502 లేదా ఎఫ్-2, 1510 చ॥అ॥ల ఫ్లింత్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా (ఉమ్మడి ఏరియాతో కలిపి)నకు **హద్దులు : తూర్పు :** ఉమ్మడి వరండా, **దక్షిణం :** గ్రౌండ్ నందు ఓపెన్ ఏరియా & లిఫ్టు, **పడమర :** గ్రౌండ్ నందు ఓపెన్ ఏరియా, **ఉత్తరం:** గ్రౌండ్ నందు ఓపెన్ ఏరియా పై హద్దులలో 1510 చ॥అ॥లు (ఉమ్మడి ఏరియాతో కలిపి)	రూ. 32,60,000/-	రూ. 3,26,000/-	రూ. 20,000/-

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్ : https://www.bankofbaroda.in/e-auction.htm మరియు https://ibapi.in లింక్‌ను చూడగలరు. ఆసక్తి గల బిడ్డర్లు **అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం. : 89775 13909** నందు సంప్రదించగలరు & మరిన్ని వివరములకు పైన ఇవ్వబడిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

తేది : 04.03.2024, ప్రదేశం : నరసరావుపేట — **సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా**

ఇడి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతా : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జారీ చేసిన ఎనిమిదో సమన్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్పందించారు. సమన్లను 'చట్టవిరుద్ధం' గా పరిగణించినప్పటికీ, ఈ నెల 12 తర్వాత తేదీన తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని తెలిపారు. అయితే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించేందుకు ఇడి అభ్యంతరం వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ సమన్లకు స్పందించకపోవడంపై ఇటీవల ఇడి కోర్టులో ఫిర్యాదు చేసింది. న్యాయస్థానం నోటీసులు జారీ చేయడంతో కేజ్రీవాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. కేజ్రీవాల్ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

రాజ్యసభ ఎన్నికలు నిర్భీతిగా జరగాలి

- సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : రాజ్యసభకు జరిగే ఎన్నికలకు అత్యంత రక్షణ కల్పించాల్సిన అవసరముందని సుప్రీం కోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. "రాజ్యసభ లేదా కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ మన ప్రజాస్వామ్యం పనితీరులో అంతర్గత పాత్ర పోషిస్తాయి. రాజ్యసభ పోషించే పాత్ర రాజ్యాంగ మౌలిక స్వరూపంలోని భాగమే. అందువల్ల, 80వ అధికరణ కింద రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవడంలో రాష్ట్రాల శాసనసభల సభ్యులు పోషించే పాత్ర గణనీయమైనది, దానికి రక్షణ కల్పించాల్సిన అవసరముంది. స్వేచ్ఛగా, చట్టపరంగా వేధిస్తారనే ఎలాంటి భయాందోళనలు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వుంది." అని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యసభ సభ్యులను ఎన్నుకునే క్రమంలో అసెంబ్లీ సభ్యులు నిర్భీతిగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడమన్నది రాష్ట్ర అసెంబ్లీ హుందాగా, సమర్ధవంతంగా పనిచేయడానికి అత్యంతావశ్యకమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. సభా వేదికపై కేవలం చట్టాలు చేయడానికి మాత్రమే పార్లమెంటరీ హక్కును పరిమితం చేయరాదని, ఎన్నికైన సభ్యుల ఇతర అధికారాలు, బాధ్యతలకు కూడా వీటిని వర్తింపజేయాలని కోర్టు పేర్కొంది.

చట్ట సభల్లో స్వేచ్ఛగా మాట్లాడలేకపోతే ప్రజాస్వామ్యానికే అర్థం లేదు

ప్రభుత్వం లేదా మరే ఇతర ప్రభుత్వ సంస్థల నుండి వేధింపులు ఎదురవుతాయనే భయం లేకుండా సభ్యులుగా తమ విధులను, బాధ్యతలను ఎంపీలు, ఎంఎల్‌ఎలు నిర్వర్తించలేకపోతే ప్రజాస్వామ్య రాజకీయాల్లో పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు తమ ప్రాతినిధ్య స్వభావాన్ని కోల్పోతాయని రాజ్యాంగ ధర్మాసనం సోమవారం వ్యాఖ్యానించింది. "సభా వేదికపై ఏ అంశంపైనైనా చర్చించేందుకు ఎన్నికైన సభ్యులకు వుండే స్వేచ్ఛ పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో చర్చాపూర్వకమైన ప్రజాస్వామ్యంలో కీలకమైన అంశంగా వుంటుంది. ఎలాంటి బలవంతపు చర్యలు లేదా భయాలు లేకుండా తమ స్వేచ్ఛను కాపాడుకునే వాతావరణంలో సభ్యులు తమ విధులను నిర్వహించుకు నేందుకు రాజ్యాంగబద్ధంగా రక్షణ కల్పించబడింది. పౌరులు మాదిరిగానే, చట్టసభల సభ్యులకూ భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తీకరణ అన్నది ప్రాథమిక హక్కు." అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

ఉద్యోగోన్నతులపై నిర్ణయం తీసుకోకుంటే

సహాయ నిరాకరణే

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల హెచ్చరిక
- ఢిల్లీలో పీస్ మార్చ్

ఢిల్లీలో పీస్ మార్చ్‌కు హాజరైన ఉద్యోగులు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతుల విషయంలో సత్వర నిర్ణయం తీసుకోకుంటే సహాయ నిరాకరణ ఉద్యమం చేపడతామని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హెచ్చరించారు. అనేక మంది ఉద్యోగులు ఉద్యోగోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని, కెరీర్‌లో ఎదుగుదల లేదని, పెన్షన్‌లోనూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌లో వందలాదిమంది సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సిఎస్ఎస్) అధికారులు పీస్ మార్చ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు హోం, రక్షణ శాఖతో సహా అనేక మంత్రిత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. పదోన్నతుల విషయంపై 2022లో నియమించిన కేడర్ రివ్యూ కమిటీ (సిఆర్‌సి) ఇంకా నివేదికను సమర్పించలేదని ఉద్యోగులు విమర్శించారు. సిఎస్ఎస్ ప్రతిస్థాయిలోనూ తన చర్చలను ఇప్పటికే పూర్తిచేసిందని, తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం కనీసం 20 ప్రభుత్వ విభాగాలు దాదాపు 2,500 అదనపు పోస్టుల కోసం అభ్యర్థనలను పంపాయి. సిఎస్ఎస్ నివేదిక సమర్పణలో జాప్యం కారణంగా ఈ విభాగాలన్నీ సిబ్బంది కొరతతో బాధపడుతున్నాయని ఉద్యోగులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఉద్యోగులు నిర్ణయించారు. 'అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తాం. అధికారిక సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ మాత్రమే పనిచేస్తాం. అదనపు సమయం పనిచేయం' అని ఉద్యోగులు హెచ్చరించారు.

హైతీలో ఎమర్జెన్సీ, కర్ఫ్యూ

పోర్టు-అవు-ప్రిన్స్ : దేశంలో ఎమర్జెన్సీని, రాత్రి వేళల్లో కర్ఫ్యూ విధిస్తున్నట్లు హైతీ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. రాజధానిలోని ప్రధాన జైలుపై దాడి చేసి, లోపల ఉన్న వేలాదిమంది ఖైదీలను విడిపించుకెళ్లేందుకు యత్నించడంతో దేశంలో అల్లర్లు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు మూడు రోజుల పాటు రాత్రి పూట కర్ఫ్యూ విధించారు. శాంతి భద్రతలను పునరుద్ధరించడం, పరిస్థితులను పూర్తిగా అదుపులోకి తీసుకురావడం ఈ చర్యల లక్ష్యాలని ప్రభుత్వం తెలిపింది. దేశ తాత్కాలిక ప్రధానిగా వ్యవహరిస్తున్న ఆర్థిక మంత్రి పాట్రిక్ మైఖేల్ బొయిస్‌వర్ట్ సంబంధిత డిక్రీపై సంతకాలు చేశారు.

లడఖ్‌కు రాజ్యాంగపరమైన రక్షణపై

హామీ ఇవ్వని అమిత్ షా

న్యూఢిల్లీ : లడఖ్ ప్రాంతానికి రాజ్యాంగపరమైన రక్షణలపై హామీ ఇవ్వడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిరాకరించారు. ఈ విషయాన్ని లడఖ్ ప్రాంతానికి చెందిన పౌర సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ)కు చెందిన నాయకులు సోమవారం అమిత్‌షాతో సమావేశమయ్యారు. సమావేశంలో ఎలాంటి సానుకూల హామీ రాలేదని చెప్పారు. 2020 తరువాత ఈ సంఘాల నాయకులు అమిత్ షాను కలవడం ఇదే మొదటిసారి. "ఈరోజు ఎల్ఎబి, కెడిఎ సబ్‌కమిటీ హోంమంత్రిత్వ శాఖ అధికారులు, లడఖ్ కేంద్రపాలిత సలహా దారులతో సమావేశాన్ని నిర్వహించింది. ఎలాంటి కచ్చితమైన ఫలితం లేకుండానే సమావేశం ముగిసింది. అనంతరం హోంమంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సబ్‌కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశం ఎలాంటి సానుకూల ఫలితాన్ని ఇవ్వలేదు. రెండు జిల్లాల ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ రెండు సంస్థలు భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాయి" అని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో నాయకులు తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇందుకు విరుద్ధమైన ప్రకటన విడుదల చేసింది. కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌కు అవసరమైన రాజ్యాంగపరమైన రక్షణలను అందించడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటనలో తెలిపింది. 2023లో ఏర్పాటైన లడఖ్ హైపవర్డ్ కమిటీ రక్షణలను అందించడానికి విధివిధానాలను చర్చిస్తోందని పేర్కొంది.

పబ్లిక్ నోటీసు

ICICI Bank — **శాఖ కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర. సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల పేర్లు (లోన్ ఎకౌంట్ నెంబరు) మరియు చిరునామా	అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ ఆస్తి వివరణ	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం	ఎన్‌పిఎ తేదీ
1	గుంటకల వెంకట శివప్రసాద్/గుంటకల లక్ష్మి/17-91 సీతారామ నగర్, యనమలకుదురు, యనమలకుదురు కృష్ణ, విజయవాడ-520007/ **LBVJW00005139220**	ఆస్తి షెడ్యూల్ : కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్ ఏరియా, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామ పంచాయతీ ఏరియా, తాడిగడప వద్ద ఆర్.ఎస్.నం.31/2 లో ఉన్న "శివం ఎన్‌క్లేవ్" యొక్క 4వ అంతస్తులో ఫ్లాట్ నం.504. తూర్పు : గ్రీన్ సిటీ ఆస్తి గోడ, దక్షిణం : డొంక రోడ్డు, పడమర : డొంక రోడ్డు, ఉత్తరం : నందమూరి లతారాణి ఆస్తి తో 1,110 చ.అ.లు. తో ఫ్లింత్ ఏరియాతో పాటు కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా తో పాటు అవిభక్త వాటా 40 చ.గ.లు. బయట 2590.10 చ.గ.లు. మరియు హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై.	22.01.2024 / 34,77,060.00	03.09. 2023
2	ముజామిల్ మహమ్మద్/గౌసాయిబాను షేక్/ డో.నం.9 2 17 4 రాయిపేట రసూల్ పేట ఫ్లాట్ నం.301 విరించి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ బ్లాక్ నం.2, అంతస్తు నం.2 పాత వార్డు 4, గుంటూరు టి.ఎస్.నం.147, గుంటూరు-522001/ **LBGTR00003229651**	గుంటూరు డివిజన్, గుంటూరు సబ్ డివిజన్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా రాయ్‌పేట (రసూల్ పేట) మున్సిపల్ పాత వార్డు నం.4, బ్లాక్ నం.2, టి.ఎస్.నం.147 ఏరియా 7528 చ.అ.లు. 'విరించి ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్' యొక్క సరిహద్దులు 476-8 చ.అ.లు. ఫ్లాట్ పై నిర్మించబడిన నాకు అర్థమైన (డో.నం.9-2-17/4) తూర్పు : పిడికిటి వెంకట మల్లికార్జునరావు మరియు ఇతరుల ఆస్తి సరిహద్దు, ఈ సరిహద్దు మొత్తం 81 అ.లు. 9 ఇం.లు., దక్షిణం : 30 అ.లు. వెడల్పు రోడ్డు పరిధి 52 అ.లు.-6 ఇం.లు., పడమర : కె.నరసింహ రావు ఆస్తి సరిహద్దు 82 అ.లు.-9 ఇం.లు., ఉత్తరం : వి.సీతారామయ్య ఆస్తి సరిహద్దు 52 అ.లు.-6 ఇం.లు. ఈ సరిహద్దుల మధ్య ఉన్న అన్నీ ఆ స్థలం 476-8 చ.గ.లు. లేదా 398-65 చ.మీ.లు., మరియు అవిభక్త భాగం కొలత 47-68 చ.అ.లు. లేదా 39-86 చ.మీ.లు. స్థలం మరియు మొత్తం లాట్ బయట ఈ రోజు మీకు అమ్మబడిన 'విరించి ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్' రెండవ అంతస్తు పై ఫ్లాట్ నం.301 మరియు మీ యాజమాన్యానికి అప్పగించబడింది. ఆ ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్. ఈ సరిహద్దుల మధ్య రెండవ అంతస్తు పై ఫ్లాట్ నం.301 తో ఫ్లింత్ ఏరియా 1575 చ.అ.లు. తో పాటు కామన్ ఏరియా. ఆ ఫ్లాట్ యొక్క అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు, విద్యుత్ మీటర్ బేరింగ్ ఎస్‌సి నం.120545, విద్యుత్ పరికరాలు, బోరు, మోటారు, లిఫ్ట్ మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియా.	18.01.2024 / 61,33,983.00	03.10. 2023
3	ధరావత్తు చిన్నారి/ధరావత్తు వినయ్ కుమార్/ డో.నం.5-6-46/ఎ 2వ అంతస్తు రాజుగిరి వారి వీధి భీమన్న వారి వీధి విజయవాడ-520001/ **LBVJW00004906313 / LBVJW00004913173**	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్ చేయబడిన (లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన ఆస్తి మొత్తం ఆ భాగం మరియు ముక్కలు 2567 చ.అ.లు. డో.నం.15 20, ఫ్లాట్ నం.జి3 సాయి రామ్ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్, రూరల్ మండలం కృష్ణాజిల్లా, విజయవాడ, ఆర్ఎస్ నం.589 4, విజయవాడ 520012. ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : కామన్ కారిడార్, పడమర : ఓపెన్ టు స్కై.	18.01.2024 / 40,16,746.00	03.11. 2023
4	కంచర్ల ఎమ్ ఎన్ ఎల్ సుధ/కంచర్ల అనిల్ కుమార్/301 జమునరాణి అపార్టుమెంట్ 3వ 3 జవాహర్ నగర్ చందానగర్ హైదరాబాద్-500050/ **LBVJW00005661438**	కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ ఏరియా, తోట్లవల్లూరు మండలం, ఎకమూరు గ్రామ పంచాయతీ ఏరియా, యకమూరు గ్రామం ఆర్.ఎస్.నం.68/7, 68/8 లో శ్రీనగర్ కాలనీ, ఫ్లాట్ నం.52, ఇంటి సైట్ తో పాటు గ్రౌండ్, ఒకటవ అంతస్తు ఆర్‌సిసి భవనం, మూల్యాంకనం నం.672, డో.నం.5-6 విస్తీర్ణం 200 చ.గ.లు. ఉన్న హద్దులు : తూర్పు : ఫ్లాట్ నం.41, దక్షిణం : ఫ్లాట్ నం.51, పడమర : 40 అ.లు. వెడల్పు రోడ్డు, ఉత్తరం : ఫ్లాట్ నం.53.	18.01.2024 / 40,64,043.00	03.11. 2023
5	బెల్లంకొండ శిరీష/ప్రసాద్ పాటిబండ్ల/ నం.4-12/1, బెల్లంకొండ బజార్, గండేపల్లి కంచికచెర్ల, విజయవాడ-521180/ **LBVJW00004948460/ LBVJW00004950202**	ఎ-షెడ్యూల్ : నందిగామ, నందిగామ గ్రామ తాలూక యొక్క ఆర్.ఎస్.నం.830/3 లో అనిశ్చిత ఉమ్మడి హక్కు 39 చ.గ.లు. బయట 392 చ.గ.లు. ఎ-షెడ్యూల్ ఆస్తిలో నిర్మాణం క్రింద రాణా టవర్స్ మరియు బి-షెడ్యూల్ సరిహద్దుల 1వ అంతస్తులో ఫ్లాట్ నం.102, కలిగి ఉన్న ఫ్లింత్ ఏరియా మరియు బాల్కానీల కొలత 1081.31 చ.అ.లు. కామన్ ఏరియా కొలత 217.69 చ.అ.లు. మరియు స్టిల్ట్ లో కార్ పార్కింగ్ కొలత 81 చ.అ.లు. క్రింది విధమైన హద్దులు : తూర్పు : ఉమ్మడి కారిడార్, లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఉమ్మడి కారిడార్, మెట్లు.	29.01.2024 / 21,51,193.00	08.09. 2023
6	వెల్లటూరి సుధాకర్/వెల్లటూరి సుబ్బలక్ష్మి/ హౌ.నం.1046 2వ అంతస్తు సెక్టార్-45 హర్యాణ గుర్‌గావ్-122001/ **LBTEN00005198416**	గుంటూరు జిల్లా, తెనాలి పశ్చిమ ఉపజిల్లా, అంగలకుదురు గ్రామ పంచాయతీ ఏరియా, అంగలకుదురు గ్రామం లోని స్థలం రెండు డో.నం.లో డో.నం.322/3, 322/4 జాబితాలు మరియు ప్లాన్ ప్రకారం ఫ్లాట్ నం.1 సైట్ హద్దులు : తూర్పు : ఫ్లాట్ నం.8 సైట్ 30'-09", దక్షిణం : 18 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు 30'-06", పడమర : 18 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు 30'-09", ఉత్తరం : ఉంముడి లక్ష్మి ఫ్లాట్ నం.2 సైట్ 31'-09". ఈ సరిహద్దుల 106.34 చ.గ.లు. లేదా 88.91 చ.మీ.లు. మరియు ఆ గ్రౌండ్ ఫ్లోర్ లో ఆర్‌సిసి దాబా మరియు అన్నీ ఇతర సౌకర్యాలతో పాటు అన్నీ యాక్సెస్ హక్కులు మరియు సౌలభ్య హక్కులు. ఆస్తి తో డో.నం.5-136. పంచాయతీ మూల్యాంకనం నం.824.	27.12.2023 / 21,46,108.00	03.10. 2023
7	రుద్ర శ్రీనివాసరావు/రుద్ర నరసింహారావు/ 31-334 రాగన్నపాలెం, చిలకలూరిపేట గుంటూరు-522616/ **LBGTR00006414625**	ఎ-షెడ్యూల్ వివరాలు : పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఉపజిల్లా, నరసరావుపేట మున్సిపాలిటీ, రామిరెడ్డి పేట, ఎస్ఎస్ఎన్ కాలేజి హాస్టల్ బజార్ లో అమ్మకం కొరకు ఆస్తి, నరసరావుపేట మున్సిపాలిటీ పాత వార్డు నం.4, ప్రస్తుత కొత్త వార్డు నం.9, పాత సర్వే డో.నం.452, ఎసి. 5-14 సెంట్లు., లొకాలిటీ నం.11, టి.ఎస్.నం.752, బ్లాక్ నం.1-10, పాత సర్వే డో.నం.448 ఎసి. 4-18 సెంట్లు., పాత మూల్యాంకనం నం.10239, తర్వాత మూల్యాంకనం నం.2086, కొత్త మూల్యాంకనం నం.1024007955, డో.నం.11-16-22/58, ప్రస్తుత డో.నం.11-16-22/1 బేరింగ్ ఆస్తి సరిహద్దులు : తూర్పు : మున్సిపల్ మార్కెట్ సరిహద్దు 42 అ.లు., దక్షిణం : మహంకాళి శ్రీనివాస రావు ఇంటి సరిహద్దు, ఉమ్మడి రిటైనింగ్ గోడ-94 అ.లు., పడమర : దివ్వెల హనుమంతరావు ఆస్తి సరిహద్దు- మా సొంత సరిహద్దు గోడ-41 అ.లు. 8 ఇం.లు., ఉత్తరం : మెసెర్స్.రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ ఆస్తి సరిహద్దు- ఉమ్మడి రిటైనింగ్ గోడ సరిహద్దు- 94 అ.లు. 6 ఇం.లు. స్థలం మొత్తం ఆ 438-08 చ.గ.లు. లేదా 366-23 చ.మీ.లు. ఈ నాలుగు సరిహద్దుల మధ్య వేయబడిన కొంత దామాషా ప్రకారం చేరిన హక్కులు కాంపౌండ్ ఏరియా 43-808 చ.గ.లు. లేదా 36-62 చ.మీ.లు. (రెండు కార్ల పార్కింగ్ ప్రదేశం తో సహా) సామూహిక నిరవధిక మరియు అవిభక్త భాగస్వామ్యం హక్కు కిందకు వస్తుంది. బి-షెడ్యూల్ సేల్ ఫ్లాట్ నం. 301 సరిహద్దులు, పైన పేర్కొన్న షెడ్యూల్ ఎ "ఎస్ఎన్ఆర్ సిగ్నేచర్" పేరుతో అపార్టుమెంట్ రెండవ అంతస్తులో మూడు పడకగదుల ఫ్లాట్. ఉత్తరం : మెట్లకేస్‌కు జతచేయబడిన కామన్ కారిడార్ మరియు లిఫ్ట్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై. ఆ మొత్తం 2007 చ.అ.లు. ఆర్‌సిసి (కామన్ ఏరియాతో సహా) ఈ నాలుగు సరిహద్దుల మధ్య మొత్తం భవనంతో సహా, అన్నీ ప్రత్యేక రూఫ్, టింబర్, ఫర్నీచర్, తలుపులు, ఫిట్టింగులు, విద్యుత్, మరియు లిఫ్ట్, మెట్లకేస్ మొదలైనవి., ఇతర ఫ్లాట్ యజమానులతో పాటు కామన్ హక్కులతో మీకు విక్రయించబడింది.	30.01.2024 / 53,36,321.00	06.10. 2023
8	.శ్రీనివాస్ రావు కోగంటి/ నాగమణి కొండూరు/కోగంటి హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్/జి3 బి3, లేక్ వ్యూ ఎన్‌క్లేవ్ మియాపూర్, హైదరాబాద్-500049/ **LBHYD00004907904/ LBHYD00005353340/ LBHYD00004898800/ LBHYD00004898686**	గుంటూరు జిల్లా,ల మంగళగిరి మండలం, కాజా గ్రామం యొక్క ఆర్ఎస్.నం.142 (భాగం), 143/1బి, 144,1 45(భాగం),146/1బి లో గుంటూరు జిల్లా, పెద్దకాకాని సబ్ రిజిస్ట్రీ, నేషనల్ హైవే రోడ్డు, నాగార్జున యూనివర్సిటీకు ఎదురు ఉన్న స్థలం విస్తీర్ణం ఎసి.33-69 సెంట్లు., మరియు హద్దులు : ఉత్తరం : ఇతరుల ఆర్.ఎస్.నం.149, 149/1బి లో స్థలం, దక్షిణం : ఆర్.ఎస్.నం.142 (భాగం) లో ఒకటవ భాగం పార్టీ నం.2కు చెందిన స్థలం కొంత మేరకు, నంబూరు (ఆర్.ఎస్.నం.201/ఎ డొంక) గ్రామం నం.77 లో స్థలం, తూర్పు : ఆర్.ఎస్.నం.140 (డొంక) లోని స్థలం మరియు లింగమనేని ఎడ్యుకేషనల్ అకాడమిక్ ఫౌండేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఎస్.నం.141 మరియు 145 (భాగం) లో ఇతరులకు చెందిన స్థలం కొంత మేరకు, పడమర : ఆర్.ఎస్.నం.143/1ఎ, 146/1ఎ మరియు 147 (రైల్వే ట్రాక్) లో స్థలం. షెడ్యూల్-బి : (విల్లా- వివరాలు) గుంటూరు జిల్లా, కాజా గ్రామం యొక్క ఆర్ఎస్ నం.142 (భాగం), 143/1బి, 144, 145 (భాగం), 146/1బి మొత్తం ఆ విల్లా బేరింగ్ నం.బిఇ080 తో బిల్టప్ ఏరియా 3305 చ.అ.లు. ఫ్లాట్ పై నిర్మాణం 244 చ.గ.లు. బయట ఎసి. 33-69 సెంట్లు. మరియు హద్దులు : ఉత్తరం : విల్లా నం.బిఇ081, దక్షిణం : పార్క్, తూర్పు : 40 రోడ్డు, పడమర : విల్లా నం.బిడబ్ల్యు066.	22.12.2023 / 1,20,44,544.00	08.10. 2023
9	తాడిబోయిన నాగేంద్రబాబు/తాడిబోయిన కృష్ణకుమారి రింగ్ రోడ్డు ఫ్లాట్ నం.2 2వ అంతస్తు అయిషాని ఎన్‌క్లేవ్ స్వామి అవెన్యూ విజయనగరం విజయనగరం-535002/ **LBGTR00006618342 / TBGTR00006370626**	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిళ్లు తో 1170 చ.అ.లు. టి.ఎస్.నం.514 2 6వ బ్లాక్ 10వ వార్డు, డో.నం.2 33 42 తెనాలి మున్సిపల్, తెనాలి ఎస్ఆర్ఓ, గుంటూరు మండలం, గుంటూరు 522201. ఉత్తరం : మున్సిపల్ రోడ్డు 20 అ.లు. దక్షిణం : ఉప్పలపాటి దమయంతి ఆస్తి, తూర్పు : సయ్యద్ అబ్దుల్ ఖాసీం ఆస్తి, పడమర : షేక్ సర్దార్ ఆస్తి.	19.01.2024 / 26,89,791.00	30.10. 2023

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది: 05 మార్చి, 2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

మీ కోసం

కారం ఎక్కువకాలం తాజాగా, రంగు మారకుండా ఉండాలంటే అందులో కొద్దిగా ఇంగువ కలిపి ఉంచాలి.

జీవన సౌరభం

చేసిన పొరపాటుకు చింతించే బదులు మళ్లీ చేయకుండా జాగ్రత్త పడటం ఉత్తమం.

అల్లరి కోతి



సీతాపురం పొలిమేరలో ఒక సత్రం ఉంది. బాటసారులు బస చేయడానికి వసతి సౌకర్యాలతో పాటు, వండుకోవడానికి పాత్రలు, మూడు రాళ్ల పొయ్యిలు, తినడానికి కంచాలు, నీటికోసం పక్కనే చేద బావి అక్కడ ఉన్నాయి. బావికి ఆనుకుని ఒక రావిచెట్టు కూడా ఉంది. దాని మీద ఎప్పటి నుంచో చాలా కోతులు ఉంటున్నాయి. వాటిలో ఒక అల్లరి కోతి ఉంది. అది బాటసారులు తిన్న తరువాత కడిగి ఆరబెట్టిన కంచాలను, గరిటెలను ఎత్తుకెళ్లి బావిలో పడేసేది. తోటి కోతులు వద్దని ఎంత వారించినా ఆ కోతి వినేది కాదు. సత్రంలో పనిచేసే రామయ్య మూడు రోజులకు ఒకసారి బావిలో దిగి కోతి పడేసిన వస్తువులన్నింటినీ బయటకు తెచ్చేవాడు.

ఒక రోజు రామయ్య ఆ అల్లరి కోతికి ఎలాగైనా బుద్ధి చెప్పాల్ని కొన్ని కంచాలను మండుతున్న మూడురాళ్ల పొయ్యి మీద పెట్టాడు. అల్లరి కోతి కోసం చెట్టు పక్కనే దాక్కుని చూశాడు. కోతి రానే వచ్చింది. ఒక కంచాన్ని పట్టుకుని కిచకిచమని విసిరేసింది. కాలిన చేతుల్ని పదే పదే చూసుకుంది. ఇంతలో రామయ్య ఆ కోతిని ఒడుపుగా పట్టుకుని గిన్నెలో సిద్ధంగా ఉంచిన వెన్నను తీసి రెండు చేతులకు రాశాడు.

'నిన్ను బాధ పెట్టాల్ని నేను ఈ పని చేయలేదు. నీకు బుద్ధి రావాలని ఇలా చేశాను నన్ను క్షమించు' అన్నాడు. ఆ తరువాత మిగిలిన వెన్నను కోతికి తినిపించాడు. తనకు నష్టం కలిగించినా తన పట్ల రామయ్య చూపిస్తున్న ప్రేమకు కోతి ఎంతో సిగ్గుపడింది. కొద్దిసేపటికి దాని రెండు చేతుల బాధ తగ్గింది. హుషారుగా పరుగు తీసి రావి చెట్టు ఎక్కింది. అది మొదలు ఇంకెప్పుడూ ఆ కోతి పాదచారులు ఆరబెట్టిన సామానును బావిలో వేయలేదు. రామయ్యతో చెలిమి చేసి సంతోషంగా ఉంది.

- యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

నేను గీసిన బొమ్మ

ముంగర రోహితశ్రీ,
3వ తరగతి, ఎంపిపిఎస్ చటాకాయ,
కైకలూరు మండలం,ఏలూరు జిల్లా,
98496 74580.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వలస కార్మికుల పిల్లల కోసం ...

మన చుట్టూ ఎంతోమంది ఎన్నో పనులు చేస్తూ ఉంటారు. రోడ్లు వేసేవారు, కాల్వలు తవ్వేవారు, భవనాలు నిర్మించేవారు.. ఇలా అసంఘటిత రంగంలో పనులు చేసేందుకు రాష్ట్రాలు దాటి మరీ వస్తుంటారు. వారి పిల్లలు దుమ్ము కొట్టుకుపోయిన బట్టలతో, చింపిరి జుట్టుతో పీలగా, కళావిహీనంగా మట్టిలో ఆడుకుంటూ కనిపిస్తారు. సమయానికి భోజనం, నిద్ర, సరైన బట్టలు లేకపోగా, పోషకాహార లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దేశంలో ఎక్కడ, ఏ మూలైనా వలస కార్మికుల జీవితాలు ఈ పరిస్థితుల చుట్టూనే పెనవేసుకుని ఉంటాయి. మరి ఆ పిల్లలు చదువుకోవాలంటే, పోషకాహారం అందాలంటే, ఉపాధి మార్గాలు చూపించాలంటే సాధ్యమవుతుందా? అని ప్రశ్న వేసుకుంటే సాధ్యమే అని నిరూపిస్తున్నారు పూణెకి చెందిన 'తారా మొబైల్ క్రెచ్‌స్' స్వచ్ఛంద సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మంజూషా జోషి.

వలస కార్మికులు ఒక చోట స్థిరంగా ఉండరు. పనిని బట్టి వివిధ ప్రాంతాలకు మారుతూ ఉంటారు. పైగా పని చేస్తేనే వారికి డబ్బులు వస్తాయి. ఈ పరిస్థితుల్లో పనులు మానుకుని, పిల్లల ఆలనాపాలన చూసేదెంతమంది? అందుకే వీరి పిల్లల కోసం నిర్వహించే ఈ క్రెచ్‌స్‌ని వారుండే చోటకే తీసుకెళ తున్నారు మంజూష. ఆయా ప్రాంతాలకు వెళ్లి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వరకు గల బాలల వివరాలను క్రెచ్ సేకరిస్తుంది.

ఆవిర్భావం ఇలా..

సింధుతాయ్ సావర్దేకర్ 1980లో ఈ మొబైల్ క్రెచ్‌స్‌ని ప్రారంభించారు. బుల్డర్స్, కాంట్రాక్టర్స్, దాతలు, సిఎస్‌ఆర్ కంపెనీలు, వాలంటీర్ల సాయంతో క్రెచ్‌స్‌తో పాటు డేకేర్ కేంద్రాలు కూడా నిర్వహించడం సంస్థ ప్రత్యేకత. ఇప్పటి వరకు లక్షకు పైగా చిన్నారులకు సేవలందించారు. పూణె వ్యాప్తంగా 16 మొబైల్ క్రెచ్ కేంద్రాలు నడిపిస్తున్నారు.

ఏ అంశాల మీద పనిచేస్తాయంటే..

ఆరోగ్యం, పోషకాహారం, విద్య అనే మూడు అంశాల మీద ఈ క్రెచ్‌స్ పనిచేస్తున్నాయి. పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు వైద్యుని పర్యవేక్షణలో చికిత్స కూడా అందిస్తున్నారు. వయసుల వారీగా వారి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంకా.. 'గర్భిణీలకు, బాలింతలకు డే కేర్ కేంద్రాల ద్వారా వైద్యం అందిస్తున్నాం. అత్యవసర చికిత్స కావాల్సిన వారికి ఆస్పత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తాం. అలాగే ఈ క్రెచ్‌స్ ద్వారా పిల్లల వయసులను బట్టి రోజుకు మూడు సార్లు పాలు, బియ్యం, చిరుధాన్యాలు, కూరగాయలు, పళ్లు, పప్పు దినుసులు వంటివి అందిస్తున్నాం. అంతేకాదు, పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చేర్పించడం కూడా బాధ్యతగా తీసుకున్నాం' అని మంజూష చెబుతున్నారు.

ఉపాధి నిమిత్తం పూణెకి వలసవచ్చిన ఈ కుటుంబాల్లో ఎక్కువ శాతం రాజస్థాన్, బీహార్, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, కర్నాటక నుండి వచ్చినవారే ఉన్నారు. ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు లేక ఈ పిల్లలకు స్కూల్లో అడ్మిషన్లు లభించడం లేదని గుర్తించిన క్రెచ్ నిర్వాహకులు అడ్మిషన్లు ఇప్పించడంలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

వివిధ కళల్లో రాణించేలా..

అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థుల కోసం డే కేర్ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణా తరగుతులను కూడా కల్పించారు. పిల్లల ఆసక్తులను బట్టి వివిధ కళల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు. చిత్రలేఖనం, బొమ్మలు తయారుచేయడం, వీధి నాటకాలు, ఆటలు, సంగీతం వంటి కళల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఆయా కుటుంబాలు తమ పనులను ముగించుకునే కాల వ్యవధి వరకు ఈ క్రెచ్‌లు కూడా అక్కడ పనిచేస్తున్నాయి. ఒకవేళ పని ముగించుకుని తల్లిదండ్రులు మరో ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు తరలిపోయినా పిల్లల విద్య ఆగిపోకుండా రెసిడెన్షియల్‌గా వారికి హాస్టల్లో పెట్టి చదివిస్తున్నారు. తల్లిదండ్రులు వారి పనులను ముగించుకుని వచ్చేవరకు ఈ పిల్లల బాధ్యత క్రెచ్ నిర్వాహకులే చూసుకుంటున్నారు.

ఉపాధి కల్పన

విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి చూపించడం కూడా క్రెచ్ తీసుకుంటోంది. ఉన్నత విద్య చదవాలనుకునే వారికి విద్య అందించడం ఉపాధి కోరుకునేవారికి నిధుల సేకరణ ద్వారా, దాతల మద్దతుతో ఉపాధి చూపించడం సంస్థ బాధ్యతగా ఉంటోంది.

స్మిత (పేరు మార్చాం) క్రెచ్ చొరవతో బాల్య వివాహం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఫైనాన్షియల్ సెక్టార్‌లో నాన్ బ్యాంకింగ్ విభాగంలో పనిచేస్తోంది. 'నేను ఈ ఆర్గనైజేషన్‌లోకి ఐదేళ్లప్పుడు వచ్చాను. నన్ను స్కూల్లో చేర్పించారు. పదో తరగతి వరకు చదివాను. ఆ తరువాత మా సొంత ఊరికి వెళ్లిపోయాను. అక్కడ మా పెద్దలు నా కంటే 10 ఏళ్లు పెద్ద వ్యక్తితో నాకు పెళ్లి నిశ్చయించారు. ఈ విషయాన్ని క్రెచ్ నిర్వాహకులకు చేరవేశాను. సరిగ్గా పెళ్ళి రోజుకు పోలీసులతో వచ్చి నా వివాహాన్ని ఆపేశారు. ఆ తరువాత సంస్థ చొరవతో పూణెకి వచ్చి ఉన్నత విద్య అభ్యసించాను. ఉద్యోగం సంపాదించాను. ఇదంతా ఒక కలలా ఉంటుంది' అని తన ఆనందాన్ని తెలియజేసింది స్మిత.

కూలీలుగా కాదు.. ఇంజినీర్లుగా..

'సంస్థ సేవలను పొందిన విద్యార్థులతో ఈమధ్యనే ఒక అల్యూమినీ కలయికను ఏర్పాటు చేశాం. 200 మంది వరకు వచ్చారు. వాళ్లంతా నచ్చిన రంగాల్లో స్థిరపడ్డారు. కొంతమంది మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. మరికొంతమంది స్కూల్ ప్రిన్సిపాల్స్‌గా స్థిరపడ్డారు. ఇంకొంతమంది మాత్రం నిర్మాణరంగంలో ఉపాధి చూసుకున్నారు. అయితే కూలీలుగా కాదు.. ఇంజినీర్లుగా భవనాలు కడుతున్నామని చెప్పారు. ఇదే మేం కోరుకుంది. ఆ పిల్లలు సాధించిన విజయాలే మా లక్ష్యాన్ని చూపిస్తున్నాయి' అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న మంజూష లాంటి స్వచ్ఛంద సేవకులు ప్రతి చోటా కనిపిస్తుంటారు. భిన్న మార్గాల్లో సామాజిక సేవలో ముందుంటున్న వారందరికీ మనసారా అభినందనలు తెలియజేద్దాం.

రైతుల గోడు ఆలకించాలి

- ప్రమాదంలో పంట నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం ఇవ్వాలి
- సంఘీభావం తెలిపిన వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి

సిఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు, వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా) /అమరావతి బ్యూరో

మంటల్లో దగ్ధమైన పసుపు పంటకు నష్టపరిహారం కోసం రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, దీనిపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి కోరారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల కేంద్రంలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం వాటిల్లడంతో అందులో పసుపు పంటను దాచుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమను ఆదుకోవాలని కోరుతూ బాధిత రైతులు చేపట్టిన రిలేదీక్షలు సోమవారంనాటికి నాలుగో రోజుకు చేరాయి. శిబిరాన్ని సందర్శించిన రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వాలు స్పందించాయని గుర్తు చేశారు. బీమా ప్రీమియంతో సంబంధం లేకుండా రైతులకు ప్రస్తుత ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రమాదం జరిగి 45 రోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రమాద కారణాలను విచారణ చేసి కోల్డ్ స్టోరేజీ యజమానిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పసుపు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల తీరు ఇదేవిధంగా కొనసాగితే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, పరిహారం దక్కే వరకూ పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు. ఘటనపై బీమా కంపెనీ రూపొందించిన నివేదికను వెల్లడించాలని కోరారు. వ్యకాస జిల్లా కార్యదర్శి ఇ అప్పారావు మాట్లాడుతూ రైతుల పోరాటంలో తమ సంఘమూ ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పసుపు రైతు బాధిత కమిటీ కన్వీనర్ వి వెంకటరామయ్య, నాయకులు ఎం శివసాంబిరెడ్డి, జె బాలరాజు, వై బ్రహ్మేశ్వరరావు, రమేష్, చంద్రశేఖర్, సురేంద్ర, పుల్లయ్య, నాగయ్య పాల్గొన్నారు.

రూ.8 వేల నష్టపరిహారం
- సిఎస్‌కు ఎపి రైతు సంఘం విజ్ఞప్తి

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పసుపు రైతులను విపత్తు సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యాన ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి సోమవారం సిఎస్‌ను కలిసి ఈ అంశంపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 19వ తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాల శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో కృష్ణా, గుంటూరు, బాపట్ల, కడప జిల్లాలకు చెందిన 381 మంది రైతులకు చెందిన లక్షా అయిదువేల పసువు బస్తాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయని, గోడౌన్ యజమాని పూర్తిస్థాయిలో ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గోడౌన్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల రైతులకు క్వింటాల్‌కు నాలుగు వేల రూపాయల నుంచి ఐదువేల రూపాయలు మాత్రమే నష్టపరిహారం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు క్వింటాల్ ధర రూ.13 వేలు ఉందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు క్వింటాల్‌కు కనీసం రూ.8 వేలను అదనంగా ఇవ్వాలని సిఎస్‌కు కోరినట్లు వివరించారు. వినతిపై స్పందించిన సిఎస్, గుంటూరు జిల్లా కలెక్టరుతో విచారణ జరిపించి, రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనరు జె శివశంకర్, రైతు నాయకులు కె శివరామకృష్ణయ్య, పసుపు రైతుల పోరాట కమిటీ నాయకులు వి వెంకటరామయ్య, ఎం శివసాంబిరెడ్డి, చంద్రశేఖర్, ఎం ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

ఫ్రెంచి జర్నలిస్టు పిటిషన్‌పై వైఖరి తెలపండి

- కేంద్రాన్ని కోరిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : భారత్‌లో జర్నలిస్టు కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు తనకు అనుమతిని నిరాకరించడానికి వ్యతిరేకంగా ఫ్రెంచ్ జర్నలిస్టు వానెసా డౌగ్‌నాక్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం వైఖరిని తెలియజేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు సోమవారం కోరింది. వానెసా ఒసిఐ (ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా) కార్డును కలిగివున్నారు. ఆమె పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ స్పందన తెలియజేయాలని కేంద్రాన్ని కోరారు. ఒసిఐ కార్డు దారుని హక్కుకు సంబంధించిన అంశమైనందున దీనిపై తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరముందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఎలాంటి నిర్దిష్ట కారణాన్ని చెప్పకుండానే డౌగ్‌నాక్ దరఖాస్తును పక్కకు పెట్టేశారని పిటిషనర్ తరపు న్యాయవాది వృందా భండారి అన్నారు. పిటిషనర్ 23 ఏళ్లుగా భారత్‌లో జీవిస్తున్నారని, పైగా ఆమె భారతీయ పౌరుడిని వివాహం చేసుకున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరపు న్యాయవాది మాట్లాడుతూ, ఒసిఐ కార్డును కలిగిన వారు జర్నలిస్టు కార్యకలాపాలు చేపట్టరాదని, అందుకోసం జర్నలిస్టు వీసా తీసుకోవాల్సి వుంటుందని, ఇందుకు సంబంధించి చట్టం స్పష్టంగా వుందన్నారు.

సమస్యల కంటే అంబానీ వివాహ వేడుకకే ప్రాధాన్యం

- మీడియా తీరుపై రాహుల్‌గాంధీ విమర్శలు

భోపాల్ : శతకోటీశ్వరుడు ముకేష్ అంబానీ ఇంట జరిగే వివాహ వేడుకను చూపించడానికి దేశంలో ప్రధాన మీడియా స్రవంతికి సమయం ఉంది కానీ... రైతుల ఆందోళన, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను చూపించ డానికి సమయం లేదని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో సోమవారం జరిగిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం దేశంలో అతి పెద్ద సమస్యలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి. అయితే మీడియా ఎందుకు రోజంతా అంబానీ వివాహం గురించే చర్చిస్తోంది. ఎవరైనా నాకు వివరించండి' అని రాహుల్ అన్నారు. 'మీరు టీవీ చూసినప్పుడు మీకు బాలీవుడ్ నటులు, కొన్నిసార్లు క్రికెటర్లు కనిపిస్తారు. మీడియాపై మీకు నియంత్రణ లేని కారణంగానే మీ సమస్యలు గురించి మాట్లాడరు' అని చెప్పారు. దేశంలోని ప్రధాన మీడియా స్రవంతి అంతా బడా పారిశ్రామికవేత్తల చేతిలోనే ఉందని విమర్శించారు. సోమవారం శివపురి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తరువాత ప్రస్తుత కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రాబల్యం ఉన్న గుణ నియోజవర్గం మీదుగా సాగింది. 2019 లోక్‌సభ ఎన్నికల వరకూ కాంగ్రెస్‌లోనే ఉన్న జ్యోతిరాదిత్య సింధియా 2020 మార్చిలో బిజెపిలో చేరారు.

మంధాన మెరుపులు

- యుపిపై 23పరుగుల తేడాతో నెగ్గిన బెంగళూరు
- మహిళల ప్రిమియర్ లీగ్

బెంగళూరు జట్టు ఆటగాళ్ల గెలుపు సంబరాలు

బెంగళూరు: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-2024తో రాయల్ ఛాలెంజర్స్ మహిళల జట్టు మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో యుపి వారియర్స్ మహిళలతో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు 23పరుగుల తేడాతో నెగ్గింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 198పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో యుపి జట్టు 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 175పరుగులే చేసింది. టాస్ గెలిచిన యుపి కెప్టెన్ బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు అదిరే ఆరంభం లభించింది. మేఘన(28), మంధాన(80) కలిసి తొలి వికెట్‌కు 5.3ఓవర్లలో 51పరుగులు జతచేశారు. ఆ తర్వాత మేఘన ఔటైనా.. ఎలీసె పెర్రీ(58)తో కలిసి మంధాన 2వ వికెట్‌కు 87పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. వీరిద్దరూ ధనా ధన్ బ్యాటింగ్ చేయగా.. చివర్లో వికెట్ కీపర్ రీచా ఘోష్(21నాటౌట్; 10బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్) రాణించారు. దీంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 3వికెట్లు కోల్పోయి 198పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. యుపి వారియర్స్ బౌలర్లు అంజలి శర్వాణి, దీప్తి శర్మ, ఎక్లేస్టోన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ టోర్నమెంట్‌లో యుపి-బెంగళూరు జట్లు నాలుగేసి మ్యాచ్‌లు ఆడి రెండేసి మ్యాచుల్లో గెలిచి.. మరో రెండేసి మ్యాచుల్లో పరాజయాన్ని చవిచూశాయి. ఛేదనలో బెంగళూరు ఓపెనర్, కెప్టెన్ హీలీ(56) అర్ధసెంచరీకి తోడు లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ దీప్తి(33), ఖేమ్నర్(31) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. నవ్‌గైర్(18), ఆటపట్టు(8), హారీస్(5), శ్వేత(1) నిరాశపరిచారు. బెంగళూరు బౌలర్లు సోఫియా డివైన్, మోలినెక్స్, వారేహామ్, శోభనకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్మృతి మంధానకు లభించింది.

స్కోర్‌బోర్డు..

బ్యాడ్మింటన్‌కు సాయి ప్రణీత్ గుడ్‌బై

హైదరాబాద్: స్టార్ షట్లర్ బి సాయి ప్రణీత్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇన్‌స్టా వేదికగా సోమవారం సాయి ప్రణీత్ ఈ విషయాన్ని వెల్లడించాడు. 31 ఏళ్ల సాయి ప్రణీత్ 2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్ అనంతరం గాయాలతో ప్రణీత్.. తన కెరీర్‌లో సింగపూర్ ఓపెన్, కెనడా ఓపెన్, థాయ్‌లాండ్ ఓపెన్ టైటిళ్లను సాధించాడు. కెరీర్ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రణీత్.. ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం సాధించలేకపోయానని బాధపడ్డాడు. ప్రణీత్‌ను భారత ప్రభుత్వం 2019లో అర్జున అవార్డుతో సత్కరించింది. కెరీర్ మొత్తంలో 225 విజయాలు సాధించి, 151 పరాజయాలను ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 46 స్థానంలో ఉన్న ప్రణీత్.. 2019లో అత్యుత్తమంగా 10వ ర్యాంక్‌కు సాధించాడు. అమెరికాలోని నార్త్ కరోలినా క్లబ్‌లో కోచ్‌గా సేవలందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

చరిత్ర సృష్టించిన భారత టిటిజట్లు

పారిస్ ఒలింపిక్స్‌కు తొలిసారి ఇరుజట్లు అర్హత

న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్(టిటి) జట్లు చరిత్ర సృష్టించాయి. పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో రెండుజట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. ఇలా ఒక ఒలింపిక్స్‌కు రెండు జట్లు అర్హత సాధించడం చరిత్రలో ఇదే తొలిసారి. ప్రపంచ టిటి ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ రెండు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. గత నెలలో బూసాన్ వేదికగా జరిగిన ప్రపంచ టీమ్ టిటి ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్‌కు చేరడంతో ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాయి. పురుషుల టీమ్ జట్టు ప్రపంచ టిటి ర్యాకింగ్స్‌లో 7వ ర్యాంక్‌లో నిలువగా.. మహిళల జట్టు 13వ స్థానంలో నిలిచింది. అలాగే పోలండ్(12), స్వీడన్(15), థాయ్‌లాండ్ కూడా మెరుగైన ర్యాంకింగ్స్ ఆధారంగా పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించి బెర్త్ దక్కించుకున్నాయి.

రంజీట్రోఫీ ఫైనల్‌కు ముంబయి

సెమీస్‌లో తమిళనాడుపై ఇన్నింగ్స్ 70పరుగుల తేడాతో గెలుపు
రికార్డుస్థాయిలో 47వ సారి తుదిపోరుకు

ముంబయి: రంజీట్రోఫీ టైటిల్‌ను 41సార్లు చేజిక్కించుకున్న ముంబయి జట్టు 47వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. తమిళనాడుతో జరిగిన సెమీఫైనల్లో ముంబయి జట్టు ఇన్నింగ్స్ 70 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు శార్దూల్ ఠాకూర్(109) శతకానికి తోడు బౌలింగ్‌లోనూ (2/48, 2/16) రాణించి ముంబయి గెలుపులో కీలక పాత్ర పోషించాడు. తమిళనాడు సోమవారం రెండో ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే ఆలౌటైంది. బాబా ఇంద్రజిత్(70) మినహా మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. ముంబయి బౌలర్లలో ములాని(4/53) నాలుగు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్, మోహిత్ అవస్థి, తనూష్ కోటియన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో తమిళనాడు 146పరుగులకే ఆలౌట్ కాగా.. ముంబయి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 378 పరుగులు చేసింది. మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో విదర్భ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 6వికెట్ల నష్టానికి 343పరుగులు చేసింది. దీంతో ఆ జట్టు ఇప్పటికే మధ్యప్రదేశ్‌పై 261పరుగుల ఆధిక్యతను సంపాదించింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కమిన్స్

హైదరాబాద్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-2024కు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ప్యాట్ కమిన్స్ ఎంపికయ్యాడు. ఆ ఫ్రాంచైజీ సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. గత సీజన్‌కు ఎయిడెన్ మార్‌క్రమ్ జట్టును నడిపించగా.. తాజాగా కమిన్స్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ప్యాట్ కమిన్స్‌ను రూ.20.50 కోట్ల భారీ ధరకు సన్‌రైజర్స్ దక్కించుకుంది. గత రెండు సీజన్‌లలో సన్‌రైజర్స్ జట్టు చివరిస్థానంలో నిలుస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68